




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 11 సంచిక : 319 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 24 జూలై 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :319 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 24 JULY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur




## ఏపీ తాలిబన్ల ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం

- జైల్లో ఉన్న మిథున్ రెడ్డి కోసం భోజనం తెచ్చిన పెద్దిరెడ్డి...
- ఏపీ లిక్కర్ స్కాంలో మిథున్ రెడ్డి అరెస్ట్
- రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వైనం
- ఇంటి భోజనానికి అనుమతించిన కోర్టు

పెన్ పవర్ డెస్క్:కూటమి పాలనతో ఏపీలో ప్రజాప్రతినిధులకు గౌరవం లేకుండా పోయిందని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి అన్నారు. రాజమండ్రి జైలులో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డితో ములాఖత్ అయిన అనంతరం వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలో తాలిబన్ల పాలన నడుస్తోంది. ఏపీలో ప్రజాప్రతినిధులకు గౌరవం లేకుండా పోయింది. కూటమి సర్కార్ అప్రజాస్వామిక్యంగా వెళ్తోంది. వైఎస్సార్‌సీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారు. ఈ ప్రభుత్వ చర్యలు చాలా ప్రమా దకరంగా ఉంటున్నాయి. అయినా మిథున్‌రెడ్డి కూటమి ప్రభుత్వ వేధింపులను దీటుగా ఎదుర్కొంటున్నారు. అయితే న్యాయపరంగా అందాల్సిన చర్యలను కూడా కూటమి అడ్డుకోవాలని చూస్తోంది. ఈ అన్యాయాలపై కచ్చితంగా న్యాయస్థానాలను ఆశ్రయిస్తాం. ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతాం

వివరాలు 2లో..

# మా దేశంలో పర్యటించండి...

## నారా లోకేశ్ ను ఆహ్వానించిన యూఏఈ ఆర్థికమంత్రి అబ్దుల్లా బిన్

- విజయవాడలో ఇన్వెస్టోపియా గ్లోబల్ సదస్సు
- హాజరైన ఏపీ మంత్రి నారా లోకేశ్, యూఏఈ ఆర్థికమంత్రి అబ్దుల్లా బిన్
- యూఏఈ సహకారంతో డిజిటల్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకుంటామన్న లోకేశ్

పెన్ పవర్ డెస్క్:డేటా విప్లవం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందువరుసలో నిలుస్తుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో జరిగిన ఇన్వెస్టోపియా గ్లోబల్ %-% ఆంధ్రప్రదేశ్ సదస్సులో ఆయన పాల్గొని, ఏఐ మరియు డేటా సెంటర్లపై జరిగిన చర్చలో మాట్లాడారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, ఏఐ సాంకేతికత అభివృద్ధిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఈ)ని ఆదర్శంగా తీసుకుంటున్నామని, ప్రపంచంలోనే తొలిసారి ఏఐ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన దేశం యుఎఈ అని లోకేశ్ గుర్తు చేశారు. యుఏఈ సహకారంతో డిజిటల్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో యుఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్ బిన్ తక్ ఆల్ మరితో మంత్రి లోకేశ్ సమావేశమై, రెన్యూవబుల్ ఎనర్జీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డిజిటల్



గవర్నెన్స్, ఏఐ ఫస్ట్ యూనివర్సిటీ, జీనోమ్ సీక్వెన్సింగ్, క్వాంటమ్ వ్యాలీ, లాజిస్టిక్స్ రంగాల్లో పెట్టుబడులపై చర్చించారు. ఈ రంగాల్లో సహకారం అందించాలని యుఏఈని కోరగా, అబ్దుల్ బిన్ సానుకూలంగా స్పందిస్తూ లోకేశ్ ను యుఏఈ పర్యటనకు ఆహ్వానించారు. ఈ సదస్సులో లోకేశ్ క్వాంటమ్ కంప్యూటింగ్ అంశంపైనా మాట్లాడారు. దక్షిణాసియాలోనే మొట్టమొదటి 152 బిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను రాష్ట్ర రాజధాని అమరావతిలో జనవరి 2026లో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ క్వాంటమ్ కంప్యూటర్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సమూలంగా మార్చబోతుందని ఆయన ఆశాభావం

వివరాలు 2లో..

## ఎయిర్ పోర్టులో పెద్దిరెడ్డిని కలిసిన టీడీపీ ఎమ్మెల్యే కొలికిపూడి!

- తనయుడు మిథున్ రెడ్డిని కలిసేందుకు రాజమండ్రి వచ్చిన పెద్దిరెడ్డి
- రేణిగుంట ఎయిర్ పోర్టులో పెద్దిరెడ్డితో కొలికపూడి షేక్ హ్యాండ్!
- చర్చనీయాంశంగా కొలికపూడి వ్యవహారం!




పెన్ పవర్ డెస్క్:ఉమ్మడి కృష్ణా జిల్లా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలిక పూడి శ్రీనివాసరావు వైఖరి ఆది నుంచి వివాదాస్ప దంగానే ఉంది. కొన్ని వివాదాల్లో

వివరాలు 2లో..



## ట్రంప్ వ్యాఖ్యలపై మరోసారి కేంద్రానికి రాహుల్ గాంధీ ప్రశ్న

- ట్రంప్ కాల్పుల విరమణ చేయించారని కేంద్రం చెబుతుందా? అని వ్యాఖ్య
- కేంద్ర ప్రభుత్వం అలా చెప్పదు.. కానీ అదే నిజమన్న రాహుల్ గాంధీ
- కాల్పుల విరమణ చేయించినట్లు 25 సార్లు ట్రంప్ చెప్పారని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:భారత్ - పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు తానే ఒప్పించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటివరకు పాతికసార్లు చెప్పారని, దీనిపై కేంద్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. పార్లమెంటు

వివరాలు 2లో..

## బొగత జలపాతం తాత్కాలిక మూసివేత...

### ఆ జలపాతాలు శాశ్వత మూసివేత



- ఈ నెల 26వ తేదీ వరకు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం
- కుండపోత వర్షాల కారణంగా పరవళ్లు తొక్కుతున్న జలపాతం
- భద్రతా కారణాల దృష్ట్యా మూసివేత
- ముత్యందార, కొంగల, మామిడిలొద్ది, కృష్ణాపురం జలపాతాల శాశ్వత మూసివేత

వివరాలు 2లో..

## వినియోగదారులకు నేరుగా విక్రయం..

# మింత్రాపై ఈడీ కేసు నమోదు

- ఎఫ్‌డీఐ నిబంధనలు ఉల్లంఘించి రూ. 1,654 కోట్ల అవకతవకలకు పాల్పడినట్లు గుర్తింపు
- హెూల్‌సేల్ క్యాష్ అండ్ క్యారీ ముసుగులో రిటైల్ ట్రేడ్‌ను నిర్వహిస్తున్నట్లు గుర్తింపు
- ఫెమా నిబంధనలు ఉల్లంఘిస్తోందంటూ ఈడీ కేసు నమోదు


పెన్ పవర్ డెస్క్:ఆన్‌లైన్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన ఈ-కా మర్స్ వేదిక 'మింత్రా'పై ఈడీ కేసు నమోదు చేసింది. ఎఫ్‌డీఐ నిబంధనలు ఉల్లంఘించి రూ. 1,654 కోట్ల మేర అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించి ఫారిన్ ఎక్స్ఛేంజీ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా) కింద కేసు నమోదు చేసింది. మింత్రాతో పాటు, అనుబంధ సంస్థలు, డైరెక్టర్లపై అభియోగాలు మోపింది. హెూల్‌సేల్ క్యాష్ అండ్ క్యారీ

వివరాలు 2లో..

## ఉపరాష్ట్రపతి ఎన్నికలకు కసరత్తు

# మొదలుపెట్టిన ఎన్నికల సంఘం

- ధన్‌కడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి పదవి కోసం త్వరలో ఎన్నికలు
- రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించడంలో ఈసీ బిజీ
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఈసీ ఎన్నికల నిర్వాహణ
- ఆ మేరకు ఉపరాష్ట్రపతి ఎన్నికల కోసం ఈసీ కసరత్తు




పెన్ పవర్ డెస్క్:జగదీప్ ధన్‌కడ్ రాజీనా మాతో ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి పద వి కోసం త్వరలో ఎన్నికలు జర గనున్నాయి. అందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. ఈ కసరత్తు పూర్తవగానే ఎన్నికల షెడ్యూల్‌ను వెల్లడించనుంది. ఇప్పటికే ఉపరాష్ట్రపతి ఎన్నికల కోసం ఎలక్టోరల్ కాలేజీని సిద్ధం చేయడంలో, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను

వివరాలు 2లో..

## తెలంగాణలో ఆరుగురు ఐఏఎస్ లకు సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్

- 2023 బ్యాచ్ ఐఏఎస్ అధికారులకు పోస్టింగ్
- ఆరుగురికి సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు
- నారాయణఖేడ్ సబ్ కలెక్టర్‌గా ఉమాహారతి

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుం ది. 2023 బ్యాచ్

వివరాలు 2లో..

## చంద్రబాబు విజన్ నచ్చింది...

# అందుకే ఆరు నెలల్లోనే వచ్చాం

## యూఏఈ ఆర్థికమంత్రి అబ్దుల్లా బిన్




- ఏపీ సీఎం చంద్రబాబుతో గత రాత్రి యూఏఈ ఆర్థికమంత్రి అబ్దుల్లా బిన్ భేటీ
- ఏపీలో పెట్టుబడులపై విస్తృత చర్చ
- విజయవాడలో ఇన్వెస్టోపియా గ్లోబల్ కార్యక్రమం
- హాజరైన అబ్దుల్లా బిన్
- దావోస్ లో చంద్రబాబుతో కేవలం 5 నిమిషాలే మాట్లాడానన్న యూఏఈ మంత్రి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ గత రాత్రి సమావేశం కావడం తెలిసిందే. ఈ భేటీలో రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు. ✓ విజయవాడలో జరిగిన ఇన్వెస్టోపియా

వివరాలు 2లో..

## ముఖ్యమంత్రి చంద్రబాబుతో వైఎస్ సునీత భేటీ

- 2019 ఎన్నికల ముందు వివేకా హత్య
- సుదీర్ఘకాలంగా న్యాయపోరాటం చేస్తున్న వివేకా కుమార్తె
- ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన సీబీఐ



పెన్ పవర్ డెస్క్:2019 ఎన్నికల ముందు వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఆ కేసును సీబీఐ చేపట్టినప్పటికీ, ఇప్పటివరకు ఓ కొలిక్కిరాలేదు. తన తండ్రి హంతకులకు శిక్ష పడేందుకు వివేకా కుమార్తె వైఎస్ సునీత సుదీర్ఘకాలంగా న్యాయపోరాటం చేస్తున్నారు. తాజాగా అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆమె ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు.

వివరాలు 2లో..

## పేదరికం లేని సమాజమే కోసమే పీ4 విధానం...

# పోస్టర్ విడుదల చేసిన మంత్రి నాదెండ్ల

- ఏపీలో పేదరిక నిర్మూలనకు పీ4 కార్యక్రమం
- మంత్రి నాదెండ్ల అధ్యక్షతన తెనాలి విజన్ యాక్షన్ ప్లాన్ సమావేశం
- త్వరలో పీ4 వెబ్ సైట్ ప్రారంభం



పెన్ పవర్ డెస్క్:ప్రపంచ దేశాలకు పెద్ద సవాలుగా మారిన పేదరి కాన్ని నిర్మూలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'పీ4 - పేదరికాన్ని పారద్రోలే కార్యక్రమం' అనే సమగ్ర విధానాన్ని రూపొందించిందని రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంగళవారం నాడు సచివాలయంలో మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరిగిన తెనాలి విజన్ యాక్షన్ ప్లాన్ సమావేశం అనంతరం ఆయన అధికారులతో కలిసి పీ4 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పీ4 కార్యక్రమం వివరాలతో త్వరలో www.zeropovertyp4.ap.gov.in వెబ్‌సైట్‌ను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు.

**ఎన్నారైలు, తెనాలి వాసుల భాగస్వామ్యం**

ఈ కార్యక్రమంలో ఎన్నారైలు, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన తెనాలి వాసుల

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

### రాజాసింగ్ పై బీజేపీ నిర్ణయం మారిందా? పార్టీ నాయకత్వం ఆలోచన అదేనా?

గోషా మహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాపై పార్టీ నాయకత్వం పునరాలోచనలో పడినట్లు తెలిసింది. ఇందుకు కారణం రాజాసింగ్ కూడా కూడా వెనక్కుతగ్గడమే కారణమని సమాచారం. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేశారు. దీంతో పార్టీ కేంద్ర నాయకత్వం ఈ నెల 11వ తేదీన రాజీనామాను ఆమోదిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే తర్వాత రాజాసింగ్ మాత్రం తాను ఏ పార్టీలో చేరనని, తాను మోదీ, అమిత్ షాలకు వీర విధేయుడినని ప్రకటించుకున్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయమన్నా తాను రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని రాజాసింగ్ తెలిపారు. అదే సమయంలో గోషామహల్ బీజేపీకి అడ్డా అని, ఇక్కడ ఎవరు పోటీ చేసినా విజయం ఖాయమని ఆయన అన్నారు.

**విరమించుకుందా?**

మరొక వైపు రాజాసింగ్ రాజీనామాను ఆమోదించిన నాయకత్వం ఆయన ఎమ్మెల్యే పదవి విషయంలో మాత్రం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. సహజంగా పార్టీకి రాజీనామా ఆమోదించిన తర్వాత పార్టీ నాయకత్వం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ కు ఈ విషయాన్ని తెలియజేయాల్సి ఉంటుంది. పార్టీ బీఫారం పై పోటీ చేసి గెలుపొందిన రాజాసింగ్ ను స్పీకర్ ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేసే అవకాశముంటుంది. కానీ బీజేపీ నాయకత్వం మాత్రం రాజీనామాను ఆమోదించి దాదాపు పన్నెండు రోజులవుతున్నా స్పీకర్ కు లేఖ రాయకపోవడంతో తిరిగి రాజీనామాపై ఆలోచన చేస్తుందని చెబుతున్నారు. రాజాసింగ్ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు పక్కా హిందుత్వ వాదిగా ముద్రపడటంతో ఆయనను బయటకు పంపించే ప్రయత్నాన్ని విరమించకుందని చెబుతున్నారు.

**తగ్గినట్లుగానే...**

దీనికి తోడు రాజాసింగ్ కూడా బీజేపీ తన రాజీనామా ఆమోదించిన తర్వాత చాలా తగ్గినట్లు కనిపిస్తుంది. రాజీనామా ఆమోదించిన తర్వాత ఎలాంటి పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలు చేయకపోవడంతో పాటు తాను మోదీ, షాలకు విధేయుడినని ప్రకటించుకోవడం కూడా మళ్లీ బీజేపీలో కొనసాగేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు అర్థమవుతుంది. దీనికి తోడు తాజాగా నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ చేసిన కామెంట్స్ కూడా ఇందుకు ఊతమిస్తున్నాయి. రాజా భాయ్ ఎక్కడున్నా గౌరవిస్తామని అరవింద్ అన్నారు. ఆయన సస్పెండ్ కాలేదు పార్టీకి రాజీనామా మాత్రమే చేశారన్న అరవింద్, పార్టీ సభ్యత్వం కోసం మిస్డ్ కాల్ ఇచ్చి సభ్యత్వం తీసుకోవచ్చని కూడా తెలిపారు. కొన్ని విషయాల్లో మనస్తాపం చెంది రాజా భాయ్ రాజీనామా చేశారని ధర్మపురి అరవింద్ అనడం కూడా రాజాభాయ్ రిటర్న్ అవుతారన్న టాక్ వినిపిస్తుంది.

# మా దేశంలో పర్యటించండి...

- మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేశారు. విశాఖపట్నంను డేటా సిటీగా అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తున్నామని, అంతర్జాతీయ సంస్థలు విశాఖలో డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్నాయని వెల్లడించారు. విద్యారంగంలో సమూల మార్పులపై దృష్టి సారిస్తున్నామని, ఎఐ మరియు క్వాంటమ్ కంప్యూటింగ్‌ను కరిక్యులంలో చేర్చి, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యలో నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెడుతున్నట్లు లోకేష్ తెలిపారు. రోజువారీ పరిపాలనలో ఎఐని వినియోగించి, ప్రజలకు సులభతరమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 'మనమిత్ర' పేరుతో వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రవేశపెట్టి, 600 రకాల పౌర సేవలను వేగవంతంగా అందిస్తున్నామని, ఇందుకోసం వివిధ శాఖలను అనుసంధానిస్తూ భారీ డేటా లేక్‌ను సిద్ధం చేసినట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో జీ42 ఇండియా సీఈఓ మను జైన్, ప్రైమస్ పార్టనర్స్ వైస్ ప్రెసిడెంట్ రక్ష శ్రద్ధ వ్యాఖ్యాతగా పాల్గొన్నారు. ఎఐ, డేటా సెంటర్లు, స్మార్ట్ గవర్నెన్స్ ద్వారా ఆర్థిక వృద్ధిని సాధించే మార్గాలను అన్వేషిస్తామని మంత్రి లోకేష్ పునరుద్ఘాటించారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికలకు కసరత్తు మొదలుపెట్టిన ఎన్నికల సంఘం

- మొదటి పేజీ తరువాయి

నియమించడంలో ఎన్నికల సంఘం బిజీ అయిపోయింది. ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి పదవి ఖాళీకాగానే రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహిస్తుంది. ఆ మేరకు ఉపరాష్ట్రపతి ఎన్నికల కోసం ఈసీ కసరత్తు చేస్తోంది. అనారోగ్య కారణాలతో తాను ఉపరాష్ట్రపతి పదవి నుంచి తప్పుకుంటున్నానని పేర్కొంటూ జగదీప్ ధన్‌కడ్ సోమవారం రాత్రి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తన రాజీనామా పంపారు. రాష్ట్రపతి నిన్న ఆయన రాజీనామాకు ఆమోదం తెలిపారు. అనంతరం కేంద్ర హోంశాఖకు పంపారు. కేంద్ర హోంశాఖ ఉపరాష్ట్రపతి రాజీనామాను ఆమోదించిన విషయాన్ని పార్లమెంట్ ఉభయసభలకు సభాధ్యక్షుల ద్వారా తెలియజేసింది.

## ట్రంప్ వ్యాఖ్యలపై మరోసారి కేంద్రానికి రాహుల్ గాంధీ ప్రశ్న

- మొదటి పేజీ తరువాయి

ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేవలం కాల్పుల విరమణ మాత్రమే కాదని, చర్చించాల్సిన అంశాలు చాలా ఉన్నాయని అన్నారు."కేంద్రం ఏమని చెబుతుంది? ట్రంప్ కాల్పుల విరమణ చేయించారని చెబుతుందా? కానీ అలా చెప్పలేరు. అయితే అదే నిజం. ఇది కేవలం కాల్పుల విరమణ వరకే కాదు, మనం చర్చించాల్సిన చాలా పెద్ద సమస్యలు ఉన్నాయి. కాల్పుల విరమణ చేయించినట్లు 25 సార్లు ట్రంప్ చెప్పారు. అసలు ట్రంప్ ఎవరు? అది ఆయన పని కాదు కదా, ప్రధానమంత్రి సమాధానం ఇవ్వడం లేదు" అని రాహుల్ గాంధీ అన్నారు. భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు ఒప్పించామని మంగళవారం కూడా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అన్నారు. ఈ ఘర్షణలో ఐదు విమానాలు కూలిపోయినట్లు చెప్పారు. కాకపోతే, ఏ దేశానివో మాత్రం వెల్లడించలేదు. ఈ ఘర్షణ అణుయుద్ధం వరకు వెళ్లలేదని అన్నారు.

## పేదరికం లేని సమాజమే కోసమే పీ4 విధానం... పోస్టర్ విడుదల చేసిన మంత్రి నాదెండ్ల

- మొదటి పేజీ తరువాయి

సహకారం తీసుకుంటామని, వారిని భాగస్వాములుగా మార్చే ప్రణాళికను చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. దీని ద్వారా ఎక్కువ మంది మహిళలకు, యువతకు ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు.

**2047 విజన్... 2029 నాటికి 50 లక్షల కుటుంబాలకు మద్దతు**

కూటమి ప్రభుత్వం 2047 విజన్‌లో భాగంగా, 2029 నాటికి 50 లక్షల కుటుంబాలను పేదరికం నుంచి అభివృద్ధి వైపు నడిపించేందుకు ఈ బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించిందని మంత్రి వివరించారు. పేదల సంక్షేమం, సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను గుర్తించి వారికి అవసరమైన మద్దతు కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. నిరుపేద కుటుంబాలను "బంగారు కుటుంబాలుగా" మార్చడమే పీ4 ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

**తెనాలి నియోజకవర్గంలో పీ4 అమలు**

తెనాలి నియోజకవర్గంలో సుమారు 14,280 బంగారు కుటుంబాలను ఇప్పటికే గుర్తించామని, వారికి అండగా నిలిచేందుకు 376 మంది వ్యక్తులు ముందుకు వచ్చారని మంత్రి నాదెండ్ల తెలిపారు. వీరు దాదాపు 3,289 మందిని దత్తత తీసుకున్నారని చెప్పారు.

డేటా వెరిఫికేషన్ అనంతరం, వీరి సహాయంతో ఆ కుటుంబాలకు ఉపాధి, విద్యకు తోడ్పాటు, వ్యవసాయ సాగు మార్కెటింగ్, బ్యాంకు రుణాలు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి వైద్య సహాయం వంటి అంశాల్లో సహాయం అందించడం జరుగుతుందన్నారు.

త్వరలో తెనాలిలో మార్గదర్శకులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఈ యాక్షన్ ప్లాన్ తెనాలి నియోజకవర్గానికి ఒక రోడ్ మ్యాప్‌గా మారుతుందని మంత్రి నాదెండ్ల ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, తెనాలి ఎమ్మార్వో గోపాలకృష్ణ, కొల్లిపర ఎమ్మార్వో జి. సిద్ధార్థ, తెనాలి ఎంపీడీవో దీప్తి, కొల్లిపర ఎంపీడీవో విజయలక్ష్మి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ లక్ష్మీపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు నేరుగా విక్రయం.. మింత్రాపై ఈడీ కేసు నమోదు

- మొదటి పేజీ తరువాయి

ముసుగులో మింత్రా, దాని అనుబంధ సంస్థ మల్టీ బ్రాండ్ రిటైల్ ట్రేడ్‌ను నిర్వహిస్తున్నాయని, ఇది ఎఫ్‌డీఐ నిబంధనలకు విరుద్ధమని ఈడీ పేర్కొంది. మింత్రా తాము హోల్‌సేల్ క్యాష్ అండ్ క్యారీ వ్యాపారంలో నిమగ్నమై ఉన్నామని చెబుతూ విదేశీ పెట్టుబడిదారుల నుంచి వేల కోట్ల రూపాయలు స్వీకరించింది. తమ ఉత్పత్తులను ఎక్కువగా వెక్టర్ ఈ-కామర్స్ ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థకు విక్రయించింది. ఆ సంస్థ ఆ ఉత్పత్తులను రిటైల్ కస్టమర్లకు అమ్మింది. వాస్తవానికి మింత్రా, వెక్టర్ ఈ-కామర్స్ ఒకే గ్రూపునకు చెందిన కంపెనీలుగా ఈడీ గుర్తించింది.

మింత్రా హోల్‌సేల్ క్యాష్ అండ్ క్యారీ వ్యాపారం చేస్తున్నామని చెప్పినప్పటికీ వాస్తవానికి మల్టీ బ్రాండ్ రిటైల్ ట్రేడింగ్ నిర్వహిస్తున్నట్లు ఈడీ గుర్తించింది. హోల్‌సేల్ క్యాష్ అండ్ క్యారీ అంటే ఉత్పత్తులను రిటైలర్లకు లేదా హోల్‌సేల్ దుకాణాలకు విక్రయించవచ్చు. కానీ వినియోగదారులకు నేరుగా అమ్మకాలు జరపరాదు. మింత్రా తమ ఉత్పత్తులను వెక్టర్ ఈ-కామర్స్ కు విక్రయించి

ఆ సంస్థ ద్వారా రిటైల్ కస్టమర్లకు చేరేలా చూస్తోంది.

అంతేకాకుండా, హోల్‌సేల్ క్యాష్ అండ్ క్యారీ సంస్థలు తమ గ్రూప్ కంపెనీలకు కేవలం 25 శాతం విక్రయాలు మాత్రమే జరపాలి. కానీ మింత్రా వెక్టర్ ఈ-కామర్స్‌కు వంద శాతం ఉత్పత్తులను విక్రయిస్తోంది. ఒకే గ్రూపునకు చెందిన సంస్థకు ఇలా పూర్తి విక్రయాలు జరపడం ఫెమా నిబంధనలు ఉల్లంఘించడమేనని ఈడీ కేసు నమోదు చేసింది.

## ఏపీ తాలిబన్ల ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం

- మొదటి పేజీ తరువాయి

అని పెద్దిరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో లిక్కర్ స్కామ్ జరిగిందనేది కూటమి కుట్రేనని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. చంద్రబాబు పర్మిషన్ ఇచ్చిన డిస్టలరీలతోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొనుగోలు జరిపింది. మా పాలనలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించింది. కానీ, కూటమి పాలనలో ఇంటింటికి మద్యం సరఫరా చేస్తున్నారు అని మండిపడ్డారాయన.

కూటమి ప్రభుత్వం డైవర్షన్? పాలిటిక్స్ చేస్తోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్క డిస్టలరీకి కూడా అనుమతి ఇవ్వలేదు.

మిథున్‌రెడ్డిపై లేనిపోని నిందలు వేస్తున్నారు. ఆయనపై పెట్టింది అక్రమ కేసు. వైఎస్సార్‌సీపీకి ఆయనకు అండగా ఉంటుంది మాజీ హోం మంత్రి అనిత అన్నారు.

## ఎయిర్ పోర్టులో పెద్దిరెడ్డిని కలిసిన టీడీపీ ఎమ్మెల్యే కొలికిపూడి!

- మొదటి పేజీ తరువాయి

ఆయన పేరు వినిపించడంతో టీడీపీ అధిష్ఠానం ఇప్పటికే పలు హెచ్చరికలు చేసింది. తాజాగా, కొలికపూడి రేణిగుంట ఎయిర్ పోర్టులో వైసీపీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న తన కుమారుడు మిథున్ రెడ్డిని కలిసేందుకు పెద్దిరెడ్డి రేణిగుంట నుంచి రాజమండ్రి వచ్చారు. అయితే, కొలికపూడి రేణిగుంట ఎయిర్ పోర్టులో పెద్దిరెడ్డిని కలవడం చర్చనీయాంశంగా మారింది దీనిపై టీడీపీ హైకమాండ్ ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. వైసీపీ నేతలతో మంచిగా ఉండడం అంటే పాముకు పాలు పోసినట్టేనని చంద్రబాబు ఇప్పటికే పార్టీ నేతలకు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, కొలికపూడి తీరు చూస్తుంటే మరోసారి గీత దాటినట్టే కనిపిస్తోంది.

## ముఖ్యమంత్రి చంద్రబాబుతో వైఎస్ సునీత భేటీ

- మొదటి పేజీ తరువాయి

వివేకా హత్య కేసులో నిందితులకు వీలైనంత త్వరగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 2024 సెప్టెంబరులో కూడా సునీత, తన భర్తతో కలిసి ఏపీ సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. తాజాగా మరోసారి తన తండ్రి హత్య అంశాన్ని చంద్రబాబు వద్ద ప్రస్తావించారు.

## బొగత జలపాతం తాత్కాలిక మూసివేత...

**ఆ జలపాతాలు శాశ్వత మూసివేత**

- మొదటి పేజీ తరువాయి

తెలంగాణలోని ప్రముఖ బొగత జలపాతాన్ని తాత్కాలికంగా మూసివేయాలని తెలంగాణ అటవీ శాఖ నిర్ణయించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నందున, ములుగు జిల్లాలోని వాజేడు వద్ద ఉన్న బొగత జలపాతం ఉప్పొంగి ప్రవహిస్తోంది. పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకొని అటవీ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 26వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు జలపాతం మూసి ఉంటుందని ములుగు జిల్లా అటవీ అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బొగత జలపాతం ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో అధికారులు ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అలాగే, ముత్యందార, కొంగల, మామిడిలొద్ది, కృష్ణాపురం జలపాతాలను శాశ్వతంగా మూసివేస్తున్నట్లు ప్రకటించారు. పర్యాటకులను ఆయా జలపాతాల వద్దకు అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ సూచనలను ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీసు కేసు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

## తెలంగాణలో ఆరుగురు ఐఏఎస్ లకు సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్

- మొదటి పేజీ తరువాయి

ఐఏఎస్ అధికారులకు సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఆరుగురు ఐఏఎస్ అధికారులకు సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్ ఇచ్చారు. నారాయణఖేడ్ సబ్ కలెక్టర్‌గా ఉమాహారతి, భైంసాకు అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్మూర్‌కు అభిజ్ఞాన్ మాల్వియా, కల్లూరుకు అజయ్ యాదవ్, భద్రాచలానికి మృణాళ్ శ్రేష్ఠ, బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌గా మనోజ్‌ను నియమిస్తూ సీఎస్ రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు.

## చంద్రబాబు విజన్ నచ్చింది... అందుకే ఆరు నెలల్లోనే వచ్చాం

- మొదటి పేజీ తరువాయి

గ్లోబల్ కార్యక్రమంలోనూ యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దావోస్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు గారితో కేవలం 5 నిమిషాలు మాట్లాడాను. ఆయన విజన్, ఆలోచనా విధానం నాకు ఎంతగానో నచ్చాయి. అందుకే ఆరు నెలల్లోనే ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు మేము సిద్ధమయ్యాం" అని వెల్లడించారు. ఏపీలో యూఏఈ పెట్టుబడులతో పర్యాటక రంగంలోనూ గణనీయమైన పురోగతి సాధించే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఎన్‌హెచ్-40 హైవే పనులను పరిశీలించిన కలెక్టర్, జిల్లా ఎస్పీ





**చిత్తూరు, పెన్ పవర్ జూలై 23 :** నాణ్యమైన పనులు చేపట్టండి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా గుడిపాల మండలం లోని నంగమంగళం వద్ద రోడ్డు మరియు బ్రిడ్జ్ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వి.ఎన్.మణికంఠ చందోలు, తదితరులు పాల్గొన్నారు. గుడిపాల మండలంపై ఉన్న NH-40 హైవే నందు జరుగుతున్న రోడ్డు పనుల, నంగమంగళం ఫ్లైఓవర్ మరియు MCR cross flyover పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని కూడలలో ప్రమాదక హెచ్చరికలు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు అనంతరంCMC ఆసుపత్రి ఫ్లైఓవర్ బ్రిడ్జ్, పనులను పరిశీలించారు ముఖ్య జంక్షన్స్ లో రేడియం స్టిక్కర్స్, లైటింగ్, జీబ్రా క్రాసింగ్ లైన్స్, సైన్ బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత కన్స్ట్రక్షన్ వారికి మరియు CMC ఆసుపత్రి అధికారులకు జిల్లా కలెక్టర్ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఎంసి ప్రతినిధి ప్రిన్సెస్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెన్ పవర్

వై.ఎస్.ఆర్. కడప

అన్నమయ్య జిల్లా

## గాజులదిన్నె ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయండి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ జూలై 23 :** కర్నూలు నగరానికి నీటి సమస్య తలెత్తకుండా నీటి పారుదల సలహా మండలి సమావేశ తీర్మానం ప్రకారం హెచ్ఎన్ఎస్ఎస్ నుండి నీరు విడుదల అవుతున్న సమయంలోనే గాజులదిన్నె ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా హెచ్ఎన్ఎస్ఎస్ డిఈ ని ఆదేశించారు. బుధవారం కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామం వద్ద హంద్రీ నీవా విస్తరణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హంద్రీ నీవా ను పరిశీలిస్తూ నీటి ప్రవాహం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.. గతంలో మాదిరిగానే ఈసారి కూడా హంద్రీ నీవా నీటితో 68 చెరువులను కూడా నింపే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హెచ్ఎన్ఎస్ఎస్ ఇంజనీర్ లను ఆదేశించారు... అదే విధంగా కాలువ వెంబడి ఉన్నటువంటి కృ ష్ణగిరి రిజర్వాయర్, పత్తికొండ రిజర్వాయర్ మరియు అన్ని తూముల ద్వారా ఆయకట్టుకు నీటిని ఇవ్వాలని కలెక్టర్ హెచ్ ఎన్ ఎస్ ఎస్ ఇంజనీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఇంచార్జి ఈ ఈ ప్రసాద్ రావు, డి ఈ ఈ కొండన్న, చెన్నయ్య, కల్లూరు తహసిల్దార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన సదస్సు




**తిరుపతి పెన్ పవర్ జూలై 23 :** తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో ఆంధ్ర ప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం విభాగం వారు సమాచార హక్కు చట్టం-2005 పైన మహిళా సంఘం సభ్యులు, మహిళలకు, రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ప్రకృతి వ్యవసాయ విభాగంలో ఉన్నటువంటి ఎలాంటి సమా చారం అయినా తెలుసుకోవాలి అనుకున్న వారు సమా చార హక్కు చట్టం-2005 నిబంధనల ప్రకారం వారు చలానా కట్టి తగు సమాచార నిమిత్తం అప్లికేషన్ దాకల్ చేసుకున్న వారికి 30 రోజులలోపు వారికి కావాల్సిన సమాచారాన్ని వారికి పోస్ట్ ద్వారా గాని లేదా సంబంధిత డాక్యుమెంట్స్ ద్వారా గాని సమాచారం అందించడం జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఏ.షణ్ముగం వివరించారు. ఈ సమాచార హక్కు చట్టం-2005 ప్రకారం ఎలాంటి సమాచారం అయినా కూడా సంబంధిత డిపార్ట్మెంట్స్‌లలో మనం చలనా కట్టి మనకు కావలసిన సమాచారాన్ని 30 రోజుల లోపు తెలుసుకోవచ్చు అని ఈ చట్టం ప్రాము ఖ్యత గురించి మహిళా సంఘం సభ్యులకు, మహిళలకు, రైతులకు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కూడా సమాచార హక్కు చట్టం 2005 పైన ఒక రోజు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి వారికి పూర్తిస్థాయిలో ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిపిఎం పట్టాభి రెడ్డి, మహిళా సంఘాల సభ్యులు మహిళలు, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి పయ్యావుల కేశవ్..

## అనుకున్నది సాధించి చూపారు



**అనంతపురం, పెన్ పవర్ జూలై 23 :** రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అనుకున్నది సాధించి చూపించారు. తాము అధికారంలోకి వస్తే హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులను చేపడతామని మాట ఇచ్చి.. చెప్పినట్టుగానే అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే కాలువ వెడల్పు పనులను మొదలు పెట్టించారు. ఆ తర్వాత పనులను ఈ సీజన్లోనే ఎన్నడూలేని విధంగా కేవలం 100 రోజుల్లోనే పూర్తి చేస్తామని చెప్పి.. ఇరిగేషన్, రెవెన్యూ, ఏపిఎస్ఈబి, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ వాయువేగంతో పనులు పూర్తి చేసేలా మంత్రి పయ్యావుల కేశవ్ అనునిత్యం దృష్టి సారించారు. ఇప్పటికే హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులు దాదాపుగా పూర్తి అయ్యాయి. ఈ సీజన్లో కాలువలో నీరు ప్రవహించే సమయానికల్లా మేజర్ పనులను పూర్తి చేయడంతో నీరుపారేందుకు ఎటువంటి ఆటంకాలు లేకుండా పోయింది. ఈ సీజన్లోనే కాలువలో 3,450 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడతామని మంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటించగా, అందుకు అనుగుణంగా హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు కూడా కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుని వేగవంతంగా వెడల్పు పనులను పూర్తి చేశారు. గతంలో హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో 1,300 నుంచి 1,400 క్యూసెక్కుల వరకు నీరు ప్రవహిస్తుండగా, వెడల్పు పనులు పూర్తి కావడంతో 3,200 నుంచి 3,450 క్యూసెక్కుల నీరు కాలువలో ప్రవహించే అవకాశం ఉందని హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజా స్వరూప్ కుమార్ తెలిపారు.




మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాలతో హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులను కేవలం వంద రోజుల్లోనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుని, జిల్లాలో మొదటి ఫేజ్ ప్యాకేజీ-2 పనులు పూర్తి పనులను పూర్తి చేయడం జరిగిందని ఎస్ఈ తెలిపారు. వీటితోపాటు తూములు ద్వారా చెరువులకు నీరు ఇవ్వడానికి కూడా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

ఈనెల 17వతేదీన నంద్యాల జిల్లా మాల్యాల పంపుహౌస్ వద్ద కృష్ణా నీటి ఎత్తిపోతలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా నీరు అనంతపురం జిల్లా సరిహద్దుల్లోకి మంగళవారం చేరగా, అదేరోజు సాయంత్రం ఉరవకొండ నియోజకవర్గంలోని ఛాయపురం గ్రామం వద్ద నీరు నియోజకవర్గంలోకి ప్రవేశించడం జరిగింది. వజ్రకరూరు మండలంలోని ఛాయాపురం గ్రామం వద్దనున్న హంద్రీనీవా సుజల స్రవంతి ప్రధాన కాలువలో వెడల్పు పనులను ఈ ఏడాది మే 9వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు పరిశీలించి ఈ సీజన్లోనే వంద రోజుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సీఎం ఆదేశాలకు అనుగుణంగా మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక దృష్టి సారించి పనులపై నిత్యం తాను ఎక్కడ ఉన్న హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులపై సమీక్ష నిర్వహిస్తూ నీరు వచ్చేలోపే పనులు పూర్తి చేయాలని చెబుతూ అధికారులతో, సంబంధిత కాంట్రాక్టర్లతో పనులు చేయించారు. జూలై నెలలోనే వర్షాలు వచ్చే సమయానికల్లా హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులను పూర్తి చేయడంపై అధికారులు కూడా దృష్టి సారించి జిల్లాలో మొదటి ఫేజ్ ప్యాకేజీ-2 పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయించారు. దీంతో కాలువలో నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా పోయాయి. మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పిన మాట నిలబెట్టుకున్నారని ఉరవకొండ నియోజకవర్గ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బుధవారం రోజు వజ్రకరూరు మండలం రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి మూడు మోటార్ల ద్వారా హెచ్ఎన్ఎస్ఎస్ కాలువకు నీటిని ఎత్తిపోతల ద్వారా హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు, నాయకులు స్విచ్ ఆన్ చేసి 850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అక్కడినుంచి ఉరవకొండ నియోజకవర్గం ద్వారా జీడిపల్లి జలాశయానికి చేరుకోనున్నాయి. జీడిపల్లి జలాశయం వద్ద 216.300 కిలోమీటర్ వద్ద ఇన్ఫాల్ రెగ్యులేటర్ వద్ద గురువారం నీటికి జలహారతి నిర్వహించడం జరుగుతుందని హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ తెలిపారు.

## స్విమ్స్‌లో నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించిన టిటిడి చైర్మెన్




**తిరుపతి పెన్ పవర్ జూలై 23 :** స్విమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న వివిధ విభాగాలకు సంబంధించిన భవనాలను టిటిడి చైర్మెన్ బీఆర్ నాయుడు పరిశీలించారు. టిటిడి ఈవో జె. శ్యామల రావు, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ లతో కలిసి బుధవారం కార్డియాక్ న్యూరో సైన్సెస్, స్విమ్స్ పాత భవనం, స్టాఫ్ క్వార్ట్స్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్విమ్స్ ఆసుపత్రి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, నిర్మాణంలో ఉన్న పనులు మరింత నాణ్యంగా చేప్టటాలని అధికారులకు సూచించారు. పెండింగ్ లో ఉన్న పనులు, డిజైన్లు , వైద్య పరికరాలు, సిబ్బంది తదితర అంశాలను నిర్ణీత సమయానికి పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధికారులను ఆదేశించారు. అంతకుముందు, స్విమ్స్ ఆసుపత్రి పనుల పురోగతిపై బుధవారం చైర్మన్ సిమ్స్ పరిపాలనా భవనంలోని సమావేశం మందిరంలో ఈవో జె. శ్యామల రావుతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిమ్స్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ విభాగాలకు సంబంధించిన వివరాలపై స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి కుమార్, టిటిడి ఇంజనీరింగ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పిపిటి) ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, ఎన్.సదాశివరావు, జేఈవో వి. వీరబ్రహ్మం, సిఈ టివి సత్యనారాయణ, ఎస్ ఈలు మనోహర్, శ్రీ వేంకటేశ్వర్లు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, వైద్యులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



బర్డ్‌లో సర్జరీల వెయింటింగ్ సమయాన్ని

## తగ్గించేందుకు చర్యలు

- టిటిడి చైర్మెన్ బీఆర్ నాయుడు



**తిరుమల పెన్ పవర్ జూలై 23 :** టిటిడి ఆధ్వర్యంలోని బర్డ్ ఆసుపత్రిలో సర్జరీల సమయాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని టిటిడి చైర్మెన్ శ్రీ బీఆర్ నాయుడు వైద్యులకు సూచించారు. తిరుపతి శ్రీ పద్మావతీ గెస్ట్ హౌస్ లోని సమావేశ మందిరంలో బర్డ్ ట్రస్ట్ నిర్వహణపై బుధవారం టిటిడి ఈవో శ్రీ జె. శ్యామల రావుతో కలిసి టిటిడి చైర్మెన్ సమీక్షించారు. ఈ సందర్భంగా టిటిడి చైర్మెన్ మాట్లాడుతూ బర్డ్ ఆసుపత్రికి ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని, గత కొంత కాలంగా బర్డ్ ఆసుపత్రి నిర్వీర్యం అయిందని, తిరిగి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. బర్డ్ లో వైద్య సేవలకు గ్రామీణ ప్రాంతాల రైతులకు, నిరుపేదలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సర్జరీలకు వెయిటింగ్ సమయాన్ని తగ్గించేందుకు అవసరమైన మౌళిక సదుపాయాలు, వైద్యులు, సిబ్బంది, మందులు, పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మోకాలి మార్పిడి, తదితర శస్త్ర చికిత్సలకు ఉపయోగించే అవసరమైన విదేశీ పరికరాలను మరింత నాణ్యంగా ఉండే వాటిని ఎంపిక చేసుకుని భారతీయ ధరలకు అనుగుణంగా సేకరించాలని సూచించారు. ఈ సందర్భంగా టిటిడి ఈవో జె.శ్యామల రావు మాట్లాడుతూ, శ్రీ పద్మావతీ చిన్న పిల్లల హృదలాయంలో చిన్న పిల్లల హార్ట్ ఆపరేషన్లకు దాతలు విరాళం ఇచ్చే ఆపన్న హృదయ స్కీం ఉందని, అదే విధంగా బర్డ్ లో కూడా పేద వర్గాల వారికి సర్జరీలు చేసేందుకు దాతల నుండి విరాళం సేకరించే అంశంపై టిటిడి జేఈవో, ఎఫ్.ఏ అండ్ సీఏవో, బర్డ్ డైరెక్టర్ సంయుక్తంగా నివేదిక తయారు చేయాలని సూచించారు. బర్డ్ ఆసుపత్రిని అందరికి అందుబాటులో ఉండేలా తయారు చేయాలన్నారు. అవసరమైన అధునాతన పరికరాలను నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డా. జి.జగదీశ్ మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలకు సర్జరీలను తక్షణం చేస్తున్నామని, జాయింట్ రీప్లేస్మెంట్‌లకు ఏడాది సమయం పడుతోందని వివరించారు. బర్డ్ ఆసుపత్రి ప్రారంభం నుండి నేటి వరకు చేపట్టిన కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు, టి.జానకి దేవి, వర్చువల్ ద్వారా డా.అదిత్ దేశాయ్, జేఈవో వి.వీరబ్రహ్మం, ఎఫ్ఏ అండ్ సీఏవో ఓ. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన

## రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ



**అనంతపురం, పెన్ పవర్ జూలై 23 :** అనంతపురం ప్రధాన కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఉన్న పలు విభాగాలను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ బుధవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వార్డులను సందర్శించి బాధిత రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు అలాగే మెటర్నటీ వార్డ్, సఖి వన్ స్టాప్ కేంద్రాలను తనిఖీ చేసి వారి పనితీరు గురించి వైద్య అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్ పర్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని ప్రజల ఆరోగ్యం సంక్షేమమేప్రధానంగా డాక్టర్లు ఇతర వైద్య ఉద్యోగ, సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో లైంగిక వేధింపుల నివారణ కమిటీ పనితీరుపై జిల్లా కలెక్టర్ కుఎప్పటికప్పుడు నివేదిక సమర్పించాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఆత్మరాంకి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఏవో మల్లికార్జున రెడ్డి, పలువురు వైద్యులు, జిల్లా సిడబ్ల్యూసి చైర్మన్ మేడా రామలక్ష్మి, డాక్టర్ శంషాద్ బేగం, ఐసిడిఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తల సమావేశం... పరిష్కార వేదిక



**కడప పెన్ పవర్ జూలై 23 :** కమిషనర్ ఆదేశాల ప్రకారం కడప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయము నందు జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి అయిన డాక్టర్ కె నాగరాజు గారి ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తల సమస్య పరిష్కారముల వేదిక జరిగినది. ఈ సమావేశంలో 17 మంది ఆశా కార్యకర్తలు పాల్గొని తమ సమస్యలు విన్నవించగా 12 మంది ఆశా కార్యకర్తల సమస్యలను తీర్చగలిగారు. అంతేకాక ఈ సమావేశానికి వచ్చిన ఆశా కార్యకర్తలకు DM&HO నాగరాజు సార్ గారు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఆశా కార్యకర్త e-ఆశ app ప్రతిరోజు ఓపెన్ చేయాలని, ఐదు ఇండికేటర్స్ ను అప్లోడ్ చేయాలని తెలిపారు. మరియు కిల్కారి సేవల గురించి ప్రతి గర్భవతికి తెలియజేసి, వాటిని ఉపయోగించుకోవాలని తెలియజేశారు. కిల్కారి సేవలను ఉపయోగించుకోవడంలో కడప జిల్లా స్టేట్ లో ముందంజలో ఉండవలెనని ఆశా కార్యకర్తలకు సూచించారు ఈ సమావేశంలో డాక్టర్ ఉమా మహేశ్వర్ కుమార్ PODT/ DIO,వేణు ఆశా డిస్టిక్ కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

### వాల్మీకిపురం శ్రీ పట్టాభిరామస్వామివారి

## పట్టాభిషేక మహోత్సవాలు

**తిరుపతి పెన్ పవర్ జులై 23 :** వాల్మీకిపురం శ్రీ పట్టాభిరామస్వామివారి పట్టాభిషేక మహోత్సవాలు జూలై 29 నుండి 31వ తేదీ వరకు ఘనంగా జరుగనున్నాయి. జూలై 29న సాయంత్రం 6 గంటలకు సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణంతో ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. జూలై 30వ తేదీన ఉదయం యాగశాల పూజ, ఉదయం 10 గంటలకు స్నపన తిరుమంజనం ఘనంగా నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు ఊంజల్‌సేవ, సాయంత్రం 6.30 గంటలకు శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం, రాత్రి 8 గంటలకు హనుమంత వాహనసేవ నిర్వహించనున్నారు. జూలై 31న ఉదయం యాగశాల పూజ, ఉదయం 6.30 గంటలకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 11 గం.ల నుండి 12 గం.ల వరకు శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం వైభవంగా జరుగనుంది. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ, రాత్రి 8 గంటలకు గరుడ వాహనంపై శ్రీపట్టాభిరాముడు విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. అనంతరం మహా పూర్ణాహుతి, కుంభోద్వాసన, కుంభప్రోక్షణం నిర్వహించనున్నారు. గృహస్తులు (ఇద్దరు) రూ.300/- చెల్లించి శ్రీరామ పట్టాభిషేకం ఆర్జిత సేవలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం బహుమానంగా అందజేస్తారు. ఈ మూడు రోజుల పాటు టీటీడీ హిందూధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో హరికథలు, భజనలు, ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు జరుగనున్నాయి.

### అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు పెన్ పవర్ జులై 23 :** యూరియా పంపిణీ, తాగునీరు అంశాలపై సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, మండల స్పెషల్ అధికారులతో, మున్సిపల్ కమిషనర్ లతో, ఎంపిడిఓలు, వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజనీర్లు, తదితరులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా.

## సిపిఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మౌలాలి, ప్రభాకర్ పిలుపు



**పామూరు, పెన్ పవర్,జూలై23 :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర 28వ మహాసభలు ఆగస్టు 20 నుంచి 25 వరకు ఒంగోలులో భారీ స్థాయిలో జరుగుతున్నాయని వాటిని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మౌలాలి,ప్రభాకర్ లు పిలుపునిచ్చారు. స్థానిక విరాట్ నగర్ లోని శాఖ కార్యకర్తలతో కలిసి రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో పేద బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం 1925లో ఏర్పడినటువంటి భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని 101 వ సంవత్సరంలో అడుగుపెడుతున్న తరుణంలో మొట్టమొదటిసారిగా రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతున్నాయని, భూమికోసం భుక్తి కోసం దున్నేవాడిదే భూమి అనే నినాదాలతో కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు నిర్వహించి ఫలితం సాధించిందని వారు అన్నారు. అనేక వేల ఎకరాలు భూములు భూస్వాములు చేతిలో నుండి ప్రజలకు పంచి ఇచ్చినటువంటి పార్టీ సిపిఐ అని వారు అన్నారు. అలాంటి పార్టీ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రం నలుమూలల నుంచి 26 జిల్లాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులు పాల్గొంటారని, మొదటిరోజు అనగా 23వ తేదీ వేలాది మందితో భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని, అలాగే 24 25తేదీల్లో ప్రతినిధుల సభ జరుగుతుందని వారు తెలిపారు. ఈ రాష్ట్ర మహాసభ జయప్రదానికి ప్రజలు, వ్యాపారవేత్తలు, మేధావులు ఆర్థిక, హార్దిక సహాయ సహకారాలు అందించి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వెంకటేశ్వర్లు, రమణయ్య, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు, ఆడపిల్లల భద్రత ప్రధాన లక్ష్యం

### రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ



**అనంతపురం, పెన్ పవర్ జూలై 23 :** రాష్ట్రంలోని మహిళలు, ఆడపిల్లల భద్రత మహిళా కమిషన్ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ తెలిపారు. బుధవారం అనంతపురంలోని ఎస్ ఎస్ బి ఎన్ డిగ్రీ కళాశాలలో జిల్లా మహిళా శిశు ,సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళల సంక్షేమం, భద్రత మరియు సాధికారతపై జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. రాయపాటి శైలజ పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన గావించి, సదస్సులో భాగంగా మహిళా భద్రత పై ఏర్పాటుచేసిన సంతకాల సేకరణ ఫ్లెక్సీ పై సంతకం చేశారు. ఈ సందర్భంగా మహిళా కమిషన్ చైర్ పర్సన్ మాట్లాడుతూ మహిళల హక్కులు కాపాడడానికి, మహిళల రక్షణ సంక్షేమానికి మహిళలపై వివిధ రకాల హింస, దారుణాలను నివారించడానికి ప్రభుత్వం ద్వారా మహిళా కమిషన్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వం మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరికి మహిళల చట్టాలపై సంపూర్ణ అవగాహన ఎంతో ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా సదస్సులో పాల్గొన్న విద్యార్థినీలను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాలలు ,కళాశాలలోని విద్యార్థినీలు కూడా ఇప్పటినుండే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక చట్టాలతో పాటు మహిళల రక్షణ,భద్రత మరియు సాధికారతలపై చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం ఎక్కడైనా ఏదైనా ఒక ఘటన జరిగినప్పుడే కాకుండా వాటిని ముందస్తుగా నివారించడానికి చర్యలు తీసుకోవడం ప్రధానమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళా భద్రతకు కట్టుబడి ఉందన్నారు. రాయలసీమ ప్రాంతంలో బాల్య వివాహాలు , గృహహింస, మహిళ ఉద్యోగుల వేధింపులు, మైనర్ బాలికలపై వేధింపులు తదితర ఫిర్యాదులు వస్తున్నందున క్షేత్రస్థాయిలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వాటన్నింటిని నివారించడానికి కమిషన్ ద్వారా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కాలేజీలో చదువుతున్న అమ్మాయిలు శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. అలాగే ఏదైనా సమస్య ఎదురైతే ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. యువతులు ఎక్కువగా మోసపూరిత మాటలు నమ్మవద్దని, సోషల్ మీడియాకు ప్రభావితులై సమస్యలను తెచ్చుకోవద్దని సూచించారు. తమ భవిష్యత్తును నష్టపోకుండా చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చుటకు కృషి చేయాలని తెలిపారు. బాగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. ఎవరైనా వెంటబడి వేధిస్తే భయపడకుండా హెల్ప్ లైన్ నెంబర్లకు ధైర్యంగా ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. వన్ స్టాప్ సెంటర్ , పోష్ యాక్ట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో జరిగిన విషయాలను తల్లిదండ్రులకు , సదస్సుకు హాజరు కాని సహచర విద్యార్థినిలకు తెలియజేయాలని చైర్పర్సన్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు సంబంధించి చేస్తున్న కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి మహిళలు పిల్లలు భద్రతపై విస్తృతంగా అవగాహన కల్పించడంలో భాగంగా కమిషన్ జిల్లాల పర్యటన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు ద్వారా చేపట్టిన కార్యక్రమాల స్టాల్ ను సందర్శించారు. అలాగే గృహహింస చట్టంపై రూపొందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరంచైర్ పర్సన్ మీడియాతో మాట్లాడుతూ...- మహిళల రక్షణ, భద్రత, సాధికారతపై క్షేత్రస్థాయిలో అన్ని జిల్లాల్లో మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా తిరిగి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మహిళల సంక్షేమ, అభివృద్ధి, భద్రత కొరకు అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. సినిమాల ప్రభావం కూడా నేటి యువతపై అమ్మాయిలపై ఎంతగానో ఉందని ఆ ప్రభావాన్ని దూరం చేయాలని సంకల్పంతో ఇలాంటి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరి ముఖ్యంగాఫేస్ బుక్, ట్విట్టర్ సోషల్ మీడియా వేదికగా పరిచయాల ద్వారా పలువురు మోసపో తున్నందున అలాంటి మహిళలు అప్రమత్తంగా ఉండాలని వారిని చైతన్య పరిచే విధంగా మహిళా చట్టాల పై విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లాలో బాల్యవివాహాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టేలా ఆదేశించినట్లు తెలిపారు. అలాగే పలు అవగాహన కార్యక్రమాల నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అమ్మాయిలు విద్యపై దృష్టి పెట్టాలని, పెద్దల సూచనలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. తొందరపాటు నిర్ణయాలు తీసుకొని తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకోవద్దని సూచించారు. గృహ హింస అనేది ఒక సామాజిక రుగ్మత అని అన్నారు. చదువుకున్న వారు కూడా గృహ హింసకు పాల్పడడం దురదృష్టకరం విచారకరమైన అంశమని అన్నారు. దీనిపై వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి చట్ట నిబంధనల మేరకు చర్యలు పటిష్టంగా చేపడతామన్నారు.- ఉద్యోగులు పని చేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగ ప్రాంతాల్లో, పాఠశాల, కళాశాలలలో అంతర్గత సెక్సువల్ హెరాస్మెంట్ ప్రివెన్షన్ కమిటీలు ఏర్పాటు కావాలని,సదరు అంశాలపై సంబంధిత అధికారులు వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అమ్మాయిలు, మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరగకుండా ముందుగా నిరోధించేందుకు మహిళా కమిషన్ ద్వారా ప్రభుత్వ సహకారంతో పలు కార్యక్రమాలతో పాటు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శక్తి యాప్ ను ప్రతి అమ్మాయి, మహిళ వారి మొబైల్ నందు తప్పనిసరిగా డౌన్లోడ్ చేసుకోవాలని, ఆపద సమయంలో శక్తి యాప్ మహిళలకు గొప్ప ఆపన్న హస్తంగా సహకరిస్తుందని తెలిపారు. సమాజంలో ఆడ, మగ అనే తేడా లేకుండా పరస్పరం గౌరవించుకోవాలని తెలిపారు.జీవించే హక్కు ఆడ మగ వారికి ఇద్దరికీ సమానంగా ఉంటుందని భావించాలన్నారు. అనంతరం పలువురు మహిళల నుండి వివిధ సమస్యలతో కూడిన అర్జీలను మహిళాకమిషన్ చైర్ పర్సన్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు,జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి నాగమణి, డి ఎం హెచ్ ఓ డా. ఈ.బి.దేవి , మాజీ నగర మేయర్ స్వరూప, దిశా పోలీస్ స్టేషన్ సీఐ వెంకటేశ్వర్లు ,నోడల్ అధికారి వనజాక్షి, సిడిపివోలు శ్రీదేవి అనురాధ , భారతి, డివిసి ఉమా నర్మద, మానవ హక్కుల సంఘం ప్రతినిధి మధుసూదన్ శర్మ తాసిల్దార్ హరిప్రసాద్, పలువురు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



### ఆపరేషన్ సింధూర్‌పై

## ఎన్.సి.సి క్యాడెట్స్ అవగాహన



**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూలై 23 :** ఆపరేషన్ సింధూర్ పేరుతో ప్రత్యర్థి దేశ తీవ్రవాదుల దాడిని భారతదేశ సైన్యం ఎలా ఎదుర్కుందో ఎన్.సి.సి క్యాడెట్లకు వివరించారు 34ఏ ఎన్ సీసీ బెటాలియన్ ఒంగోలుకు చెందిన కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ మోహన్ ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కాలేజిలో ఆపరేషన్ సింధూర్ పై అవగాహన కల్పించారు. కళాశాలలోని విశ్వేశ్వరయ్య సెమినార్ హాలులో బుధవారం ఈ కార్యక్రమం జరిగినట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి తెలియజేశారు. అసలు జమ్మూ కాశ్మీర్ లో పరిస్థితులు ఎలా ఉంటాయి? పెహల్గామ్ లో అటాక్స్ ఎలా జరిగాయి. ఆ తర్వాత ఆపరేషన్ సింధూర్ ని ఎలా నిర్వహించారు? మన వాళ్లు పాకిస్థాన్ సైనికులను ఎలా ఎదుర్కొన్నారు? తదితర అంశాలపై క్యాడెట్స్ కి తెలియజేశారు. ఎన్ సీసీ క్యాడెట్లు విపత్కర పరిస్తులలో డిఫెన్స్ లో భాగస్వామ్యులు కావాలి అంటే ఇలాంటి విషయాలు పై అవగాహన పెంచుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో క్విస్ కళాశాల ఎన్ సీసీ క్యాడెట్లతో పాటు క్విస్ స్కూల్ ఎన్ సీసీ క్యాడెట్లు, వివిధ కళాశాలలకు చెందిన 400 మంది ఎన్ సీసీ క్యాడెట్లు హాజరయ్యారు.

## చిన్నటేకూరు గ్రామంలో అంగన్వాడి ఆకస్మిక తనిఖీ

### - జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా







**కర్నూలు, పెన్ పవర్ జూలై 23 :** అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భవతులు, పిల్లలు, బాలింతలకు ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో అంగన్వాడి సెంటర్ ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంగన్వాడీ కేంద్రంలో మహిళలు, పిల్లలకు అందుతున్న సేవలను పరిశీలించారు.

పిల్లలు, గర్భిణీలు, బాలింతల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని, వారికి పౌష్టికాహార కిట్లను పంపిణీ చేసి, వాటిని వినియోగించుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. అలాగే పిల్లలు, గర్భవతులకు అవసరమైన వైద్యసేవలు అందేలా పర్యవేక్షణ చేయాలన్నారు.. అంగన్వాడీ కేంద్రాలలో ఉన్న న్యూట్రీ గార్డెన్ ల్లో కూరగాయలను, ఆకుకూరలను ఎక్కువగా పండించాలని, తాజాగా పండించిన కూరగాయలను, ఆకుకూరలను అంగన్వాడి కేంద్రాలలో వినియోగించుకోవాలన్నారు. అనంతరం వంట గదిలో పిల్లలకు వండిన ఆహారాన్ని కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి నిర్మల, కల్లూరు తహసిల్దార్ ఆంజనేయులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# కనిగిరి అభివృద్ధి కి సేవకుడిగా పనిచేస్తా : ఎమ్మెల్యే ఉగ్ర



**పీసీపల్లి పెన్ పవర్ జూలై 23 :** కనిగిరి నియోజకవర్గ అభివృద్ధికి తాను ఒక సేవకుడిగా పనిచేస్తానని కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి ఒక్కరూ తమ తమ నియోజకవర్గాల్లో పర్యటించి ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకోవటానికి సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం పీసీపల్లి మండలంలోని పెద అలవలపాడు గ్రామంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. వృద్ధులు దివ్యాంగులకు పెన్షన్లు పెంచి వారు గౌరవంగా జీవించేలా చేశారన్నారు. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఉన్న పిల్లలందరూ చదువుకునేలా మార్గం చూపారని తెలిపారు ఇలా అన్ని వర్గాల ప్రజలకు చేయూతనిచ్చేలా సూపర్ సిక్స్ పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమల చేస్తున్నారన్నారు. పెద అలవలపాడు గ్రామస్తులు తమ గ్రామంలో నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా రాబోయే ఆరు నెలలలో నేటి సమస్య లేకుండా పరిష్కరిస్తామని అన్నారు.

అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థినీ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం గ్రామ సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పీ 4 కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికంగా ఉన్నత స్థానాలకు ఎదిగిన వారు కింది స్థాయిలో ఉన్న కుటుంబాలను దత్తత తీసుకునే ఆలోచనతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారని పేదలను ఆదుకునే మిషన్ పీ 4 చరిత్ర సృష్టించే కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సిహెచ్ ఉష ఎంపీడీవో హనుమంతరావు మండల వ్యవసాయ అధికారి రంగాకృష్ణ విద్యాశాఖ అధికారులు సంజీవి శ్రీనివాసులు ఇన్చార్జి ఏపివో జహంగీర్ భాష పంచాయితీ రాజ్ ఏఈ తిరుపాలయ్య ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మండల అధికారులు పిఎసిఎస్ చైర్మన్ పరిమి ఈశ్వరరావు మండల పార్టీ అధ్యక్షులు వేమూరి రామయ్య జనసేన మండల పార్టీ అధ్యక్షులు రాజు పువ్వాడి నాగరాజు నాగోతి శ్రీనివాసులు తెలుగు యువత అధ్యక్షులు నాగేంద్రబాబు వీరపనేని పెద్దన్న మహేంద్ర మండల తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.






# జాతీయ మహిళా సాధికారత కాన్ఫరెన్స్ ప్రణాళికలు సిద్ధం



## జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్

**తిరుపతి, పెన్ పవర్ జూలై 23 :** సెప్టెంబర్ 14, 15 వ తేదీలలో తిరుపతి జిల్లాలో జరిగే జాతీయ మహిళా సాధికారితకు సంభందించిన కాన్ఫరెన్స్ ను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. బుదవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు మరియు ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు , రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు సత్యప్రసాద్, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ ప్రసన్న కుమార్ సూర్యదేవర, ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఓ ఎస్ డి, పెట్టన్న చౌదరి, టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు, టిటిడి ఈ.ఓ. శ్యామల రావు, జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి నగరపాలక కమీషనర్ ఎన్.మౌర్య లతో కలసి సెప్టెంబర్ 14, 15 తేదీలలో తిరుపతి నందు జరిగే జాతీయ మహిళా సాధికారత సదస్సు నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ మాట్లాడుతూ దేశం మొత్తం మీద 31 అసెంబ్లీలు ఉన్నాయి ప్రతి అసెంబ్లీలో కూడా వివిధ రకాల కమిటీలు ఉంటాయన్నారు. పార్లమెంటు స్పీకర్ గారు నూతన ఒరవడి తీసుకుని రావడం జరిగిందన్నారు. ఈ కమిటీలలో మహిళా కమిటీలు కూడా ఉంటాయి ఈ కమిటీల ద్వారా అనేక సమస్యలపై చర్చలు జరుగుతుంటాయి అన్నారు. ప్రతి సమస్యను స్పీకర్ డిప్యూటీ, స్పీకర్ పరిష్కరించాలంటే కష్టమైన పని అని అసెంబ్లీలో వివిధ రకాల కమిటీలు ఉంటాయని ఒక కమిటీ ఒక్కక్క విషయం పైన చర్చించడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగానే మహిళ సాధికారతకు సంబంధించిన ఒక కమిటీ కూడా ఉందని ఆ కమిటీలలో వారు సమస్యలపై చర్చించి అసెంబ్లీకి వారి తరపునుంచి చర్చ విధానాలను తెలియజేయడం, పరిష్కారం మార్గాలను అన్వేషించి స్పీకర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా అసెంబ్లీలో చర్చించిన అంశం ను కూడా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. న్యాయపరమైన వంటి సమస్యలపై ప్రభుత్వం ద్వారా పరిష్కారం చేయడం జరుగుతుందని అన్నారు. లోకసభ స్పీకర్ గారు ప్రతి లోక సభలో కూడా ప్రతి సమస్యపై కూడా ఒక ప్రత్యేకమైన చర్చ ఉండాలని ఆ రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల వాళ్ళు కూడా భాగస్వామ్యం కావాలని తెలియజేశారు. ఆ కమిటీ ద్వారా చర్చ జరిగిన తర్వాత తీసుకున్న నిర్ణయాలు సరైనవి అయితే రాష్ట్ర అభివృద్ధికి సరైన నిర్ణయం చేయడమే ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. అసెంబ్లీలో వారం రోజులు పాటు చర్చలు కాకుండా సంవత్సరానికి 60 రోజులు చర్చలు జరిగేలా జరగాలని 60 రోజులు కూడా రాష్ట్రానికి సంబంధించిన సమస్యలు పరిష్కారం జరిగేలా ఉండాలని లోకసభ స్పీకర్ తెలిపారు అని అన్నారు. బాంబేలో ఈ మధ్యకాలంలో ఎస్టిమేట్ కమిటీ అలాగే ఎస్సీ ఎస్టీ లకు సంబంధించి సమావేశం కూడా జరిగిందని, అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మహిళ లకు సంబంధించిన కమిటీ ఏర్పాటు చేసే అవకాశం రావడం జరిగిందని తెలిపారు. మహిళా సాధికారత కమిటీలు తిరుపతి జిల్లాలో సెప్టెంబర్ 14, 15 తేదీలలో మహిళా సాధికారత సంబంధించిన సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఈ కమిటీకి ప్రతి రాష్ట్రాన్ని కూడా ఐదు ఆరు మంది సభ్యులు హాజరు కావడం జరుగుతుందని తెలిపారు. వీరందరూ కూడా రెండు రోజులు వారి సమస్యల మీద సుదీర్ఘంగా చర్చించి ఆ రిపోర్టుని పార్లమెంట్, అసెంబ్లీ ద్వారా గాని చర్చించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగానే తిరుపతి జిల్లాలో వేదికగా మహిళా సాధికారత సంబంధించిన కాన్ఫరెన్స్ నిర్వహించడం అదృష్టంగా భావించడం జరుగుతుందని తెలిపారు.. ఇది ఒక మంచి కార్యక్రమం అని మేము కార్యక్రమంలో భాగస్వామ్యం అవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమమును ఎక్కడా జరగని విధంగా కమిటీల వాళ్ళందరికీ అకామిడేషన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి మీ అందరి సహకారం కావాలని, మన ప్రాంతంలో ఏర్పాటు చేయడం ఇది ఒక మంచి అవకాశం అని ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు. ఈ సమావేశం అనంతరం కాన్ఫరెన్స్ కు హాజరైన వారికి శ్రీకాళహస్తి దైవ దర్శనం ,శ్రీసిటీ, శ్రీహరికోట వంటి ప్రదేశాలలో సందర్శించడం జరుగుతుందని అన్నారు. మన రాష్ట్రంలో మహిళలకు సంబంధించిన కార్యక్రమాలు కూడా నిర్వహణ కూడా అదే రోజు ఉంటుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటి స్పీకర్ మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి, దేశ ప్రధానులు మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారని అన్నారు. మహిళల విషయంలో డ్వాక్రా వ్యవస్థ దేశ స్థాయిలో ఉన్నప్పటికీ మన రాష్ట్రంలో ఉన్నంత మహిళాభ్యుదయం ఇంకెక్కడా లేదని తెలిపారు. మహిళా సాధికారత కమిటీలు పార్లమెంట్ లో 31 మంది ఉంటారని అలాగే ఒక రాష్ట్రానికి 6 మంది వరకు కమిటీ మెంబర్లు ఉంటారని, మన రాష్ట్రంలో ఈ సమావేశం నిర్వహించాలని అనుకున్నప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి గారు కూడా ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని సూచించారని తెలిపారు. ఈ సమావేశం తిరుపతిలో సెప్టెంబర్ 14, 15 తేదీలలో నిర్వహించడం జరగనున్నదని మొదటిగా దైవ దర్శనాలతో మొదలై 14 న ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని సమావేశం అనంతరం కమిటీ వారికి చంద్రగిరి కోటలో సౌండ్ అండ్ లైట్ షో ప్రదర్శనకు చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తామని, అలాగే 15 వ తేది శ్రీకాళహస్తి ప్రసస్తిని , కళంకారీ కళల ప్రశస్తిని కూడా తెలియజేసేలా ఏర్పాట్లు చేయడానికి చర్యలు తీసుకుంటామని శ్రీకాళహస్తి శాసన సభ్యులు చెప్పారని తెలిపారు. ఈ పర్యటనను కమిటీ వారికి గుర్తు ఉండేలా ఏర్పాట్లు చేయాలనీ అన్నారు. ఈ సమావేశం నిర్వహణకు తిరిగి 15 రోజుల తరువాత మళ్ళీ సమావేశం నిర్వహించుకున్దామని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతానికి జిల్లా కలెక్టర్, నగరపాలక కమీషనర్, ఇతర జిల్లా అధికారులు కృషి చేయాలని కోరారు. జిల్లా ఇంచార్జి మంత్రి మాట్లాడుతూ...సెప్టెంబర్ 14 , 15 తేదీలలో జరిగే జాతీయ మహిళా సాధికారత కాన్ఫెరెన్స్ కు లైజన్ ఆఫీసర్ ల ఏర్పాటు, భద్రత, వసతి, సమావేశ వేదిక సంబందించిన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కాన్ఫెరెన్స్ విజయవంతం అయ్యేలా విధులు కేటాయించిన అధికారులు పనిచేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తిరుపతి జిల్లా 34 మండలాలు 7 మున్సిపాలిటీలు, నాలుగు రెవెన్యూ డివిజన్ల కలిగి ఉందని స్పీకర్ కు తెలియజేశారు. జాతీయ మహిళా సాధికారిత కాన్ఫరెన్స్ కు సంభందించిన ఆజెండ్ ను సంబంధిత అధికారులతో కలిసి తయారు చేయడం జరిగిందని తెలిపారు. కాన్ఫరెన్స్ కు సమావేశం అయ్యే అతిధులకు స్వామివారి దర్శనం,సమావేశ వేదిక, అకామిడేషన్, బోజన వసతి, రవాణా, భద్రత ఏర్పాట్ల పై ప్రణాళిక బద్ధంగా ప్లాన్ చేయడం జరిగిందని తెలిపారు. 14, 15 తేదీలలో రెండు రోజులు కాన్ఫెరెన్స్ ఉందని వివిధ హెూటల్ లలో అధితులకు బస ఏర్పాటు చేయడంతో పాటు, అన్ని ప్రదేశాలలో భద్రతా కట్టుదిట్టంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడం



జరుగుతుందని, కాన్ఫెరెన్స్ కు లైజన్ అధికారులను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రెండు రోజుల కాన్ఫెరెన్స్ అనంతరం 16 వ తేదీన అతిధులు శ్రీసిటీ, శ్రీహరికోట తదితర ప్రాంతాలలో పర్యటించేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షి , డి ఆర్ ఓ నరసింహులు, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, ఎల్.ఎల్.ఎ లు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుదీర్ రెడ్డి, నెలవెల విజయశ్రీ, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరపతి , శ్రీకాళహస్తి , సూళ్ళూరుపేట ఆర్ డి ఓ లు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, కిరణ్మయి, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, అడిషినల్ ఎస్.పి.రవిమనోహరా చారి, శాప్ చైర్మన్ రవి నాయుడు, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పోరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదా శివం, హస్త కళా కార్పోరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ జూలై 23 :** వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలను అందించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కల్లూరు మండలం చిన్నటేకూరులో ఉన్న డా.బి.ఆర్.అంబేద్కర్ సెంటినరీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలు, విద్యా బోధన గురించి అడిగి తెలుసుకున్నారు.. పిల్లలు పడుకోవడానికి అదనంగా రెండు గదులు



ఏర్పాటు చేసేందుకు ఎస్టిమేట్స్ తయారుచేసి పంపించాలని సిద్ధం చేయాలని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి ని ఆదేశించారు..అలాగే కళాశాలలో కొన్ని గదుల్లో పైకప్పు పాడయినందువల్ల వాటితో పాటు, అవసరమైన ఇతర మరమ్మతులకు ఎస్టిమేట్స్ పంపించాలని కలెక్టర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల జిల్లా కో ఆర్డినేటర్ ను ఆదేశించారు..వీటిని మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.. టాయిలెట్ లను పరిశీలిస్తూ, మరింత మెరుగ్గా టాయిలెట్లను నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కో ఆర్డినేటర్



ను ఆదేశించారు.. ఆర్ఓ మినరల్ ప్లాంట్ ఏర్పాటు చేయించాలని కో ఆర్డినేటర్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, కలెక్టర్ స్పందిస్తూ ఆర్వో ను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు గణితం లెక్చరర్ బోధిస్తున్న తరగతి గదిలో విద్యార్థులతో పాటు కలెక్టర్ వెనుక కూర్చుని గణితం పాఠాన్ని విన్నారు...ఈ సందర్భంగా విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ అధ్యాపకులకు సూచించారు..అలాగే మెనూ ప్రకారం రుచికరమైన మంచి భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి, కల్లూరు తహసిల్దార్ ఆంజనేయులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఐఐటీ నీట్ అకాడమీ ఇంచార్జి ఉమామహేశ్వరప్ప, ఎస్ డబ్ల్యూ ఆర్ ఈ ఎఫ్ ఎక్స్ చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 25, 26వ తేదీలలో టీటీడీ జూనియర్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

**తిరుపతి జూలై 23 :** టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాల, శ్రీ పద్మావతి జూనియర్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశానికి జూలై 25, 26వ తేదీలలో ఉదయం 8 గంటలకు ఆయా కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. టీటీడీలో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్ ఉద్యోగుల పిల్లలు, బాలమందిర్ పిల్లలు, సీటు వచ్చి వివిధ కారణాలతో మూడు విడతలలో కౌన్సెలింగ్‌కు హాజరు కానివారు, తిరుపతిలోని స్థానిక విద్యార్థి, విద్యార్థునులకు ప్రాధాన్యత ఉంటుంది. జూలై 25న 550 పైబడి మార్కులు వచ్చిన విద్యార్థులు, జూలై 26న 450 మార్కులు కంటే తక్కువ వచ్చిన విద్యార్థులు హాజరు కావచ్చు. కళాశాలలో మార్కుల ప్రాతిపదికన ప్రాధాన్యత ప్రకారం సీట్లు కేటాయిస్తారు. హాస్టల్ వసతి స్పాట్ అడ్మిషనుల వారికి కేటాయించరు, కావున ఈ విషయాన్ని విద్యార్థులు గమనించగలరు. ఇదివరకే http://admissions.tirumala.org ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, సంబంధిత కళాశాలలో సీట్లు మాత్రమే కావాల్సివారు, ధ్రువీకరణపత్రాలు, ఫీజులతో నేరుగా సంబంధిత జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాల్సి ఉంటుంది.

## బేస్తవారిపేట మండలంలో యూరియా కొరత లేదు

**బేస్తవారిపేట,పెన్ పవర్ జూలై 23 :** బేస్తవారిపేట మండలంలో రైతులకు అవసరమైన యూరియా ఆర్ఎస్కే కేంద్రాల్లో నిల్వ ఉందని, రైతులు యూరియా దొరకడం లేదని ప్రచారం చేస్తున్నారని అలాంటి అపోహలు రైతులు నమ్మవద్దని బేస్తవారిపేట వ్యవసాయ అధికారి తెలిపారు. బుధవారం మండలంలోని అక్కపల్లి మరియు పి వి పురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ బేస్తవారిపేట మండలంలో యూరియా కొరత లేదని రైతులు వారికి సంబంధించిన రైతు సేవ కేంద్రాలకు వెళ్లి తెచ్చుకోవాలని తెలియజేసినారు. మొక్కజొన్న పైరును విత్తన ఉత్పత్తి కొరకు సాగు చేసే రైతులు విత్తనోత్పత్తి కంపెనీ ప్రతినిధుల నుండి అగ్రిమెంట్ తీసుకున్న తర్వాతనే సాగు చేయాలని తెలియజేసినారు. అలాగే ఎరువుల దుకాణాల నందు విత్తనములు ఎరువులు పురుగు మందులు మొదలైనవి ఏవి కొనుగోలు చేసిన దుకాణ యజమానుల నుండి అడిగి రసీదులు పొందవలెనని అలా తీసుకున్న మసీదులను మరియు ప్యాకెట్లను భద్రంగా ఉంచుకోవాలని తెలియజేసినారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం కింద మన ప్రకాశం జిల్లా కు వరి కంది ఎండుమిరప మినుము సజ్జ పైర్లు ఎంపిక కావడం జరిగిందని కావున పై పైర్లు వేసిన రైతులందరూ మీసేవ కేంద్రాల నందు క్రాఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి పీఎం ఎఫ్బి వై పథకంలో నమోదు చేయించుకోవాలని తెలియజేసినారు. ఉద్యానవన విస్తరణ అధికారి చిన్న శేషగిరి మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్ 90% రాయితీపై సరఫరా చేస్తున్నారన్నారు.

# ఇండియాలో అత్యంత విలువైన టాప్ 10 కంపెనీలివే




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత ఆర్థిక వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో దేశ ఆర్థికాభివృద్ధికి కీలకపాత్ర పోషిస్తున్న అగ్రగామి కంపెనీలపై ఆసక్తి నెలకొంది. మార్కెట్ క్యాపిటలైజేషన్ ఆధారంగా, భారతదేశంలో అత్యంత విలువైన టాప్-10 కంపెనీల వివరాలు, వాటి రంగాల ప్రాముఖ్యత, మార్కెట్ విలువలను పరిశీలిద్దాం.

రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానంలో నిలిచింది. మార్కెట్ క్యాప్ ?19.30 లక్షల కోట్లతో, ఇంధనం, టెలికాం, రిటైల్, డిజిటల్ సేవలలో ఈ సంస్థ తనదైన ముద్ర వేసింది. జియో ద్వారా టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు, రిటైల్ విభాగంలో అంతర్జాతీయ భాగస్వామ్యాలు, పునర్వినియోగ ఇంధనంపై భారీ పెట్టుబడులు దీని ప్రత్యేకతలు.

రెండో స్థానంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఉంది. ?15.34 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో, ఇది భారతదేశంలో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. రిటైల్, కార్పొరేట్ బ్యాంకింగ్ సేవలలో ఉన్నత స్థాయిని ప్రదర్శిస్తూ, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌తో విలీనంతో సంస్థ స్థిరత్వం మరింత పెరిగింది.

భారతీ ఎయిర్‌టెల్ మూడవ స్థానంలో నిలిచింది. ?11.44 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో, మొబైల్, బ్రాడ్‌బ్యాండ్, డీటీహెచ్ సేవలలో దేశీయంగా, అంతర్జాతీయంగా అగ్రగామిగా ఉంది. గూగుల్‌తో భాగస్వామ్యం గ్రామీణ ప్రాంతాలలో ఇంటర్నెట్ విస్తరణకు దోహదపడుతోంది.

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 11.42 లక్షల కోట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. గ్లోబల్ ఐటీ సేవల కంపెనీగా 46 దేశాల్లో డిజిటల్ సేవలను అందిస్తోంది. క్లౌడ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీలో పెట్టుబడులు దీని బలాన్ని పెంచుతున్నాయి.

ఐసీఐసీఐ బ్యాంక్ ?10.29 లక్షల కోట్లతో ఐదవ స్థానంలో ఉంది. డిజిటల్ బ్యాంకింగ్, వినియోగదారుల అనుభవాలను ఆధారంగా చేసుకుని వేగంగా అభివృద్ధి చెందుతోంది. విస్తృత బ్రాంచ్ నెట్‌వర్క్ దీని విజయానికి ఆధారం.

ఆరో స్థానంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిలిచింది. ?7.24 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో, ఇది దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్‌గా, 22,000కుపైగా బ్రాంచ్‌లతో దేశవ్యాప్తంగా విస్తరించి ప్రభుత్వ రంగంలో కీలక పాత్ర పోషిస్తోంది.

ఇన్ఫోసిస్ ఏడవ స్థానంలో ఉంది. ?6.81 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో, 50 దేశాల్లో సేవలు అందిస్తూ గ్లోబల్ ఐటీ రంగంలో ముఖ్య స్థానాన్ని కలిగి ఉంది. డిజిటల్ సేవలు, ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలలో ముందంజలో ఉంది.

ఎల్ఐసీ 5.95 లక్షల కోట్లతో ఎనిమిదో స్థానంలో నిలిచింది. దేశంలో అతిపెద్ద బీమా సంస్థగా 59% మార్కెట్ వాటాను కలిగి ఉంది. బీమా సేవలతోపాటు పెట్టుబడులలోనూ కీలక పాత్ర పోషిస్తోంది.

బజాజ్ ఫైనాన్స్ తొమ్మిదవ స్థానంలో నిలిచింది. ?5.74 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో కన్స్యూమర్, ఎస్ఎంఈ, కమర్షియల్ ఫైనాన్సింగ్ రంగాల్లో బలమైన ఉనికిని కలిగి ఉంది. డిజిటల్ సేవలలో ఆవిష్కరణలు సంస్థ విజయానికి దోహదపడుతున్నాయి.

చివరిగా, పదవ స్థానంలో హిందూస్థాన్ యునిలీవర్ ఉంది. ?5.49 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో డవ్, లక్స్, లిప్టన్ వంటి బ్రాండ్‌లతో ఎఫ్ఎంసీజీ మార్కెట్‌ను ఆధిపత్యంగా ఆక్రమించింది. బ్రాండ్ నైపుణ్యం, వినియోగదారుల విశ్వాసం సంస్థ బలంగా నిలిచాయి.

ఈ టాప్-10 సంస్థలు భారత ఆర్థిక వ్యవస్థకు దిశానిర్దేశం చేస్తున్నాయి. డిజిటలైజేషన్, టెక్నాలజీ, వినియోగదారుల నమ్మకం, పెట్టుబడుల వ్యూహాలతో ఇవి దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. మార్కెట్ విలువల ఆధారంగా సంస్థల సామర్థ్యాన్ని అంచనా వేయవచ్చు, కానీ దీర్ఘకాలికంగా వీటి పనితీరు దేశ ఆర్థిక స్థిరత్వానికి ప్రతిరూపంగా మారుతోంది.

# టీసీఎస్ సగం సగం పనులు... ఉద్యోగులకు కొత్త తలనొప్పులు!




**హైదరాబాద్ పెన్ పవర్:** గత కొంత కాలంగా టీసీఎస్ పై పలు వివాదాలకు సంబంధించిన కథనాలొస్తున్న సంగతి తెలిసిందే! ఇందులో భాగంగా.. దేశీయ ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) లో లంచాలకు ఉద్యోగాలు అనే కుంభకోణం జరిగిందని.. ఇందులో భాగంగా భారీ ఎత్తున ముడుపులు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చారని గతంలో సంచలన ఆరోపణలు తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే!

ఆ తర్వాత కాలంలో... సంప్రదింపులేమీ జరపకుండానే సుమారు 2వేల మంది ఉద్యోగుల్ని వివిధ నగరాలకు బలవంతంగా బదిలీ చేసిందని.. ఫలితంగా ఆయా ఉద్యోగులకు, వారి కుటుంబాలకు తీవ్ర వేదన మిగిల్చిందని ఐటీ వర్కర్స్ యూనియన్ టీసీఎస్ పై మండిపడింది! ఇలా రకరకాల వివాదాలు అప్పట్లో వినిపించిన వేళ.. తాజాగా ఉద్యోగులకు సంబంధించిన మరో విషయం తెరపైకి వచ్చింది!

అవును... వివిధ కంపెనీల్లో రెండు నుంచి ఎనిమిదేళ్ల మధ్య ఉన్న ఉద్యోగులకు టీసీఎస్ కొలువులు ఆఫర్ చేసి.. అనంతరం జాయినింగ్ డేట్లు మాత్రం ఇవ్వడం లేదని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్ సుఖ్ మండవీయాకు బాధితులు ఫిర్యాదు చేశారని తెలుస్తోంది. ఈ సందర్భంగా నాస్ సెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయిస్ సెనెట్ (ఎన్.ఐ.టీ.ఈ.ఎస్.) ఈ మేరకు కేంద్రానికి లేఖ రాసింది.

ఈ సందర్భంగా... సుమారు 600 మంది అనుభవం ఉన్న వ్యక్తులకు ఆఫర్ లెటర్లు ఇచ్చిన సంస్థ.. జాయినింగ్ లో మాత్రం ఎడతెగని జాప్యం చేస్తోందని ఆ లేఖలో పేర్కొంది. సదరు ఉద్యోగులు ఆర్థిక, మానసిక, వృత్తిపరంగా దెబ్బతింటున్నారని ఆందోళన వ్యక్తంచేసింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరింది!

ఇదే సమయంలో... ఆ అభ్యర్థుల జాయినింగ్ డేట్లకు సంబంధించి కచ్చితంగా టైమ్ లైన్ ప్రకటించేలా జోక్యం చేసుకోవాలని కార్మిక శాఖను కోరిన ఎన్.ఐ.టీ.ఈ.ఎస్... జాప్యానికి తగిన ఆర్థిక పరిహారం కూడా ఇప్పించాలని, టీసీఎస్ ఎంప్లాయిస్ అసిస్టెంట్ ప్రోగ్రాం ద్వారా అభ్యర్థులు కోలుకొనేటట్లు సాయం చేయాలని కోరింది. దీనిపై తాజాగా టీసీఎస్ స్పందించింది!ఈ వ్యవహారంపై టీసీఎస్ స్పందించినట్లు జాతీయ మీడియా పేర్కొంది. ఇందులో భాగంగా... తాము ఇచ్చిన అన్ని ఆఫర్లను పూర్తి చేస్తామని.. అది ఫ్రెషర్స్ అయినా, అనుభవజ్ఞులైనా.. టీసీఎస్ నుంచి ఆఫర్ లెటర్ అందుకొన్న ప్రతిఒక్కరూ కంపెనీలో ఉంటారని తెలిపింది! అయితే.. తమ వ్యాపారం డిమాండ్ ఆధారంగా జాయినింగ్ డేట్లు ఆధారపడి ఉంటాయని పేర్కొంది.ఈ సందర్భంగా స్పందించిన ఎన్.ఐ.టీ.ఈ.ఎస్. అధ్యక్షుడు, ముంబై హైకోర్టు న్యాయవాది హర్ ప్రీత్ సింగ్ సలుజా... ఈ ఆలస్యం వల్ల అభ్యర్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. ఇదే సమయంలో... అటు ఆర్థికంగానూ, ఇటు వృత్తిపరంగానూ కుంగిపోతున్నారని అన్నారు!

## ఎయిర్ ఇండియా ప్రమాదం..మృతదేహాలు తారుమారయ్యాయ్..

# ఆందోళనలో యూకే బాధిత కుటుంబాలు




అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మృతిచెందిన వారి మృతదేహాలు తారుమారయ్యాయనే వార్తలు తీవ్ర కలకలం రేపాయి. యూకే మృతుల కుటుంబాలకు పంపించిన మృతదేహాలు తారుమారు అయినట్లు తెలుస్తోంది. దీంతో బాధితుల్లో ఒకరి బంధువులు అంత్యక్రియలను రద్దు చేసుకున్నారు. మరో కేసులో ఇద్దరు బాధితుల మృతదేహాలను ఒకే శవపేటికలో ఉంచినట్లు UK మీడియా హౌస్ చెబుతోంది.

బ్రిటిష్ మృతుల DNA లను వారి కుటుంబాలు నమూనాలతో సరిపోల్చడం ద్వారా గుర్తించేందుకు ఇన్నర్ వెస్ట్ లండన్ కరోనర్ డాక్టర్ ఫియోనా విల్కాక్స్ యత్నించగా ఈ విషయం బయటపడింది.ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి విచారణ జరుగుతోంది. రిపోర్టుల ప్రకారం.. యుకె ప్రధానమంత్రి ఈ విషయాన్ని ప్రధాని మోదీతో లేవనెత్తే అవకాశం ఉంది.


ప్రమాదంలో మృతిచెందిన UK పౌరుల్లో చాలా మందికి అంత్యక్రియలు భారతదేశంలోనే నిర్వహించారు. అయితే 12 మృతదేహాలను UKకి పంపించారు. ఇక్కడే ప్రధాన సమస్య తలెత్తింది.

UKకి పంపిన మృతదేహాలలో కొన్ని తప్పుగా బదిలీ అయ్యాయని..బాధితుల కుటుంబాలకు వారి ఆత్మీయుల మృతదేహాలకు బదులు ఇతరుల మృతదేహాలు అందాయని వార్తలు వచ్చాయి. దీనివల్ల బాధితుల కుటుంబాలు తీవ్ర మానసిక క్షోభకు గురయ్యాయి. అంత్యక్రియల ఏర్పాట్లు చేసుకున్న తర్వాత ఇతరుల మృతదేహాలు అందినట్లు తెలియడంతో వారు దుఖంలో మునిగిపోయారు.

టా టా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిర్ ఇండియా ఈ ఘటనలో మరణించిన ప్రతి కుటుంబానికి రూ. 1 కోటి పరిహారంగా ప్రకటించింది. అంతేకాకుండా తక్షణ అవసరాల నిమిత్తం రూ. 25 లక్షల అదనపు తాత్కాలిక పరిహారం కూడా అందజేసింది. ఈ ఘటన విమానయాన చరిత్రలో ఒక విషాదకర అధ్యాయంగా మిగిలిపోయింది. ఇది మృతదేహాల గుర్తింపు, బదిలీ ప్రక్రియలలో మరింత కచ్చితత్వం, సున్నితత్వం అవసరాన్ని గుర్తుచేస్తుంది.

## పోలీసులంటూ మహిళకు 9 గంటలు నరకం..

# వీడియో కాల్ లో బట్టలు విప్పించి..




డిజిటల్ అరెస్ట్ నేరాలు మళ్లీ పెరుగుతున్నాయ్. తాజాగా బెంగళూరులో ఇద్దరు మహిళలను నేరగాళ్లు పోలీసు అధికారులం అంటూ టార్చర్ చేశారు. తొమ్మిది గంటల పాటు కొనసాగిన ఘటన అందరినీ షాక్ కి గురిచేసింది.

బెంగళూరులో నివసించే మహిళ ఆమె స్నేహితురాలు థాయిలాండ్ నుంచి వచ్చాక నేరగాళ్ల వలలో చిక్కారు. ఉదయం 8856062795 నంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తాము ముంబై కొలాబా స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని.. జెట్ విమానయాన సంస్థ నరేష్ గోయల్ కేసులో మనీలాండరింగ్ వ్యవహారంలో ఆమె పేరుందని, ఒక మర్డర్ కేసులో కూడా ఇరుక్కున్నారంటూ నమ్మబలికారు నేరగాళ్లు. తాను ఎలాంటి తప్పు చేయలేదని తాను థాయిలాండ్ నుంచి వచ్చానని సదరు మహిళ చెప్పింది. నేరగాళ్లు ఆమె డెబిట్ కార్డ్ వివరాలు చెప్పి తాము నిజమైన సీబీఐ అధికారులుగా నమ్మబలికారు. దీంతో బాధితులు కాల్ నిజమేనని అనుకున్నారు. వీడియో కాల్ ద్వారా సీబీఐ కార్యాలయానికి అనుసంధానిస్తున్నట్లు చెప్పిన నేరగాళ్లు.. వారిని డిజిటల్ అరెస్ట్ చేసినట్లు చెప్పారు. 24 గంటల పాటు వాట్సాప్ వీడియో కాల్ లో అందుబాటులో ఉండాలన్నారు. అలాగే వారు చెప్పిన ఖాతాల్లోకి డబ్బు పంపాలంటూ 58వేల రూపాయలు కొట్టేశారు.

అయితే ఇక్కడితో ఆగని మోసగాళ్లు మహిళలను మెడికల్ ఎగ్జామినేషన్ చేయాలంటూ బట్టలు విప్పించారు. ఒంటిమీద ఉన్న పుట్టుమచ్చలు, గాయాలు, టాటూలను పరిశీలించారు. తమ ఇల్లు పూర్తిగా సర్వేలెన్స్ లో ఉందని ఇంట్లో నుంచి ఎక్కడికీ వెళ్లొద్దని చెప్పినట్లు బాధితులు పోలీసులకు చెప్పారు. అయితే ఈ వీడియోలను రికార్డ్ చేసిన నేరగాళ్లు మహిళలను హేళనగా మాట్లాడి ఇబ్బందికి గురిచేశారు. ఇదంతా జరుగుతున్న క్రమంలో ఇద్దరు మహిళల్లో ఒకరు తన స్నేహితులను సంప్రదించి తాము పడుతున్న ఇబ్బంది గురించి వెల్లడించింది. దీంతో అప్పటి వరకు తాము మోసగాళ్ల చేతిలో ఇరుకున్నట్లు గుర్తించిన మహిళలు స్నేహితుల సూచన మేరకు అప్రమత్తం అయ్యారు. అయినప్పటికీ వదలని నేరగాళ్లు మహిళలను బెదిరిస్తూ.. వారి వీడియోలు, ఫోటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తామంటూ బెదిరింపులకు దిగారు. నేరగాళ్ల కాల్స్ బ్లాక్ చేసిన మహిళలు వెంటనే పోలీసులను సంప్రదించి కేసు నమోదు చేశారు.

# మలేరియాకు కొత్త వ్యాక్సిన్.. స్వదేశీ పరిజ్ఞానంతో అడ్‌ఫాల్సివాక్స్ వచ్చేస్తుంది




**హైదరాబాద్ పెన్ పవర్:** మలేరియా నివారణకు ఐసీఎంఆర్ కొత్త వ్యాక్సిన్ ను అభివృద్ధి చేస్తోంది. ఇది పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేస్తున్నారు. గతంలో ఉన్న వ్యాక్సిన్లు కేవలం మలేరియా పరాన్న జీవి ప్లాస్మోడియం ఫాల్సిపరం ఒక దశపై మాత్రమే పనిచేస్తాయి. ఈ కొత్త వ్యాక్సిన్ మలేరియా పరాన్న జీవి రెండు దశలపైనా సమర్థవంతంగా పనిచేస్తుంది. ప్రస్తుతం ప్రీక్లినికల్ దశలో అద్భుతమైన ఫలితాలను అందిస్తోంది. త్వరలో క్లినికల్ ట్రయల్స్ పూర్తి చేసుకొని అందుబాటులోకి రానుంది.. వివరాల్లోకి వెళితే.

మలేరియా నివారణకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ స్వదేశీ పరిజ్ఞానంతో 'అడ్‌ఫాల్సివాక్స్ (AdFalciVax%)µ అనే మల్టీ-స్టేజ్ మలేరియా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేస్తోంది. ఈ వ్యాక్సిన్‌ను ICMR ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లోని రీజినల్ మెడికల్ రీసెర్చ్ సెంటర్ (RMRC), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మలేరియా రీసెర్చ్ (NIMR), డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీకి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనాలజీ (NII%) సహకారంతో అభివృద్ధి చేస్తున్నారు. ఇది మేక్ ఇన్ ఇండియా చొరవలో భాగంగా దేశీయంగా అభివృద్ధి చేస్తున్న మొదటి మలేరియా వ్యాక్సిన్. అడ్‌ఫాల్సివాక్స్ అనేది రీకాంబినెంట్ చిమెరిక్ వ్యాక్సిన్. ఇది మలేరియా పరాన్నజీవి అయిన ప్లాస్మోడియం ఫాల్సిపరం రెండు కీలకమైన దశలను లక్ష్యంగా పనిచేస్తుంది. ఇది ప్రస్తుతం ఉన్న చాలా వ్యాక్సిన్‌ల కంటే విభిన్నమైనది. అవి సాధారణంగా ఒకే దశను లక్ష్యంగా పనిచేస్తాయి.

**ప్రీ-ఎరిథ్రోసైటిక్ (కాలేయ) దశ :** మానవ శరీరంలోకి పరాన్నజీవి ప్రవేశించిన వెంటనే కాలేయంలో వృద్ధి చెందే దశ.

**ట్రాన్స్‌మిషన్ (లైంగిక) దశ :** మలేరియా వ్యాప్తికి కారణమయ్యే పరాన్నజీవి దశ.

ఈ వ్యాక్సిన్ మనుషులకు మలేరియా రాకుండా కాపాడటమే కాకుండా, వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాపించకుండా నిరోధించడంలో సహాయపడుతుంది. ఇది వ్యాధి సంక్రమణను తగ్గించి, సామాజిక వ్యాప్తిని కూడా నియంత్రించే సామర్థ్యాన్ని కలిగి ఉంది.

**బెనిఫిట్స్...**

ఇప్పటికే ఉన్న WHO సిఫార్సు చేసిన RTS,S/AS01 - Mosquirix, R21/Matrix-M వ్యాక్సిన్లు ఒకే దశలో రక్షణ కల్పిస్తాయి. అయితే అడ్‌ఫాల్సివాక్స్ రెండు దశల్లో రక్షణ కల్పిస్తుంది. పరాన్నజీవి రోగనిరోధక వ్యవస్థ నుంచి తప్పించుకునే ఛాన్స్ ఉండదు. ఈ వ్యాక్సిన్ తో దీర్ఘకాలిక రోగనిరోధక శక్తి కూడా లభిస్తుంది. ఈ వ్యాక్సిన్ లో ముఖ్యమైన బెనిఫిట్ ఏమిటంటే.. ఇది గది ఉష్ణోగ్రత వద్ద తొమ్మిది నెలలకు పైగా పనిచేస్తుంది. రవాణా ,స్టోరేజ్ చాలా సులభం. తక్కువ ఖర్చుతో కూడుకున్న వ్యాక్సిన్. దీనిని సురక్షితంగా, సులభంగా ఉత్పత్తి చేయగల బాక్టీరియల్ సిస్టమ్ అయిన లాక్టోకాకస్ లాక్టిస్ లో ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతానికి అడ్‌ఫాల్సివాక్స్ ప్రీ-క్లినికల్ దశలో అద్భుతమైన ఫలితాలను చూపుతోంది. ఇది ఇంకా అభివృద్ధి ప్రారంభ దశల్లోనే ఉంది. క్లినికల్ ఉపయోగం కోసం ఆమోదం పొందలేదు.

ICMR ఈ వ్యాక్సిన్ ఉత్పత్తి ,విస్తృత వినియోగం కోసం అర్హత కలిగిన సంస్థలు, కంపెనీలు ,తయారీదారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. టెక్నాలజీ బదిలీ ద్వారా వ్యాక్సిన్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది.మలేరియా రహిత భారతదేశం అనే ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవడంలో ఈ స్వదేశీ వ్యాక్సిన్ ఒక కీలక సాధనంగా మారే అవకాశం ఉందని పరిశోధకులు భావిస్తున్నారు.

# గార్డ్ ఆఫ్ హానర్‌తో గౌరవం: ఓటమితోనే రస్సెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు



**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్ విధ్వంసకర ఆల్ రౌండర్ ఆండ్రీ రస్సెల్ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ ముగిసింది. బుధవారం (జూలై 23) ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టీ20 తర్వాత రస్సెల్ సొంతగడ్డపై గ్రాండ్ గా గుడ్ బై చెప్పాడు. మ్యాచ్ కు ముందు రస్సెల్ కు అరుదైన గౌరవం లభించింది. జమైకా వేదికగా ముగిసిన రెండో టీ20 మ్యాచ్ కు ముందు వెస్టిండీస్, ఆస్ట్రేలియా క్రికెటర్లు గార్డ్ ఆఫ్ హానర్ తో గౌరవించారు. తన ఫేర్ వెల్ మ్యాచ్ లో రస్సెల్ కు విండీస్ క్రికెట్ బోర్డు ట్రోఫీతో పాటు బ్యాట్ ను గిఫ్ట్ గా ఇచ్చి సత్కరించింది. తన చివరి మ్యాచ్ ను రస్సెల్ ఓటమితో ముగించడం విచారకరం.

ఆస్ట్రేలియాతో జరిగిన తన చివరి మ్యాచ్ లో రస్సెల్ తన విధ్వంసాన్ని చూపించాడు. కేవలం 15 బంతుల్లోనే 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 35 పరుగులు చేసి ఆసీస్ బౌలర్లపై ఆధిపత్యం చూపించాడు. బౌలింగ్ లో ఒక ఓవర్ వేసి 16 పరుగులు సమర్పించుకున్నాడు. ఆస్ట్రేలియాతో 5మ్యాచ్ ల టీ20 సిరీస్ కు ముందు గురువారం (జూలై 18) విండీస్ క్రికెట్ రస్సెల్ రిటైర్మెంట్ గురించి తెలుపుతూ అతని రిటైర్మెంట్ వార్తను నివాళి పోస్ట్‌తో వెల్లడించింది. జమైకాకు చెందిన రస్సెల్ తన చివరి రెండు మ్యాచ్ లు తన సొంతగడ్డ సబీనా పార్క్‌లో ఆడి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాడు. అయితే రెండు మ్యాచ్ ల్లోనూ వెస్టిండీస్ ఓడిపోయింది.

2010 లో రస్సెల్ తన టెస్ట్ క్రికెట్ ద్వారా తన అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. గాలేలో శ్రీలంకపై ఆడిన ఈ టెస్ట్ రస్సెల్ కెరీర్ లో మొదటిది అదే చివరిది. 2011లో వన్డే, టీ20 ల్లో అరంగేట్రం చేశాడు. ముఖ్యంగా టీ20 క్రికెట్ లో రస్సెల్ విధ్వంసకర ఆటగాడిగా ప్రపంచ క్రికెట్ లో తనదైన ముద్ర వేశాడు. వెస్టిండీస్ తరపున ఓవరాల్ గా 86 టీ20 మ్యాచ్ లాడిన ఈ విడీస్ విధ్వంసకర వీరుడు 22.00 సగటుతో 1,122 పరుగులు చేశాడు. 163.08 స్ట్రైక్ రేట్‌తో మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. బౌలింగ్ లోనూ తన మార్క్ చూపిస్తూ 30.59 సగటుతో 61 వికెట్లు కూడా పడగొట్టాడు. 56 వన్డేల్లో 2229 పరుగులు చేశాడు. 2012, 2016లో వెస్టిండీస్ జట్టు ఐసీసీ టీ20 వరల్డ్ కప్ గెలుచుకున్న జట్టులో రస్సెల్ సభ్యుడు.

ఈ మ్యాచ్ విషయానికి వస్తే బుధవారం (జూలై 23) జరిగిన రెండో టీ20 వెస్టిండీస్ పై ఆస్ట్రేలియా 8 వికెట్ల తేడాతో అలవోకగా గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. బ్రాడం కింగ్ (51) హాఫ్ సెంచరీ చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. రస్సెల్ 36 పరుగులు చేసి వేగంగా ఆడాడు. మిగిలిన వారు విఫలమయ్యారు. లక్ష్య ఛేదనలో వెస్టిండీస్ 15.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసి గెలిచింది. జోష్ ఇంగ్లిస్(77), గ్రీన్ (56) భారీ భాగస్వామ్యంతో ఆస్ట్రేలియా విజయాన్ని అందుకుంది. 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో ప్రస్తుతం ఆస్ట్రేలియా 2-0 ఆధిక్యంలో ఉంది.

# తొలి సెషన్ మనదే.. ఇంగ్లాండ్‌కు వికెట్ ఇవ్వని జైశ్వాల్, రాహుల్



**హైదరాబాద్ పెన్ పవర్:** మాంచెస్టర్ వేదికగా ఇంగ్లాండ్ తో జరుగుతున్న నాలుగో టెస్టులో టీమిండియా నిలకడగా ఆడుతోంది. బుధవారం (జూలై 23) ఓల్డ్ ట్రాఫోర్డ్ స్టేడియంలో ప్రారంభమైన ఈ మ్యాచ్ లో తొలి రోజు తొలి సెషన్ లో టీమిండియా ఆధిపత్యం చూపించింది. ఓపెనర్ రాహుల్, జైశ్వాల్ పట్టుదలగా ఆడడంతో తొలి రోజు లంచ్ సమయానికి 26 ఓవర్లలో భారత జట్టు వికెట్ నష్టపోకుండా 78 పరుగులు చేసింది. రాహుల్ (40), జైశ్వాల్ (36) క్రీజ్ లో ఉన్నారు. ఈ సెషన్ లో ఇంగ్లాండ్ బౌలర్లు ఎంతలా శ్రమించినా టీమిండియా వికెట్ తీయలేకపోయారు.

**ఆచితూచి ఆడిన రాహుల్, జైశ్వాల్:**

తొలి రోజు పిచ్ సీమర్లకు అనూకూలంగా ఉందని భావించిన స్టోక్స్.. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో ఈ సిరీస్ లో వరుసగా నాలుగో సారి టాస్ ఓడిపోయిన గిల్ సేన బ్యాటింగ్ కు వచ్చింది. ఓపెనర్లు జైశ్వాల్, రాహుల్ ఇద్దరూ కూడా ఆచితూచి ఇన్నింగ్స్ ఆరంభించారు. ఇద్దరూ కూడా ఎలాంటి అనవసర షాట్స్ ఆడకుండా జాగ్రత్తగా బ్యాటింగ్ చేశారు. ఒక ఎండ్ లో రాహుల్ పర్వాలేదనిపించినా.. మరో ఎండ్ లో జైస్వాల్ పూర్తిగా డిఫెన్సివ్ కే పరిమితమయ్యాడు. దీంతో పరుగుల వేగం తగ్గింది.

తొలి 10 ఓవర్లలో 27 పరుగులే రాబట్టిన టీమిండియా.. తర్వాత 10 ఓవర్లలో మరో 27 పరుగులు చేసింది. లంచ్ కు ముందు మన ఓపెనర్లు జాగ్రత్తగా ఆడడంతో ఈ సెషన్ ను వికెట్ లేకుండానే ముగించింది. ఈ మ్యాచ్ ఇంగ్లాండ్ ప్లేయింగ్ 11లో షోయబ్ బషీర్ స్థానంలో ఆల్ రౌండర్ లియాన్ డాసన్ జట్టులోకి వచ్చాడు. మరోవైపు ఇండియా ఈ మ్యాచ్ లో టీమిండియా మూడు మార్పులతో బరిలోకి దిగుతుంది. కరుణ్ నాయర్ స్థానంలో సాయి సుదర్శన్.. ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ నితీష్ రెడ్డి స్థానంలో శార్దూల్ ఠాకూర్.. గాయపడిన ఆకాష్ దీప్ స్థానంలో అనుషూల్ కంబోజ్ ప్లేయింగ్ 11లో చోటు దక్కించుకున్నారు.

# అఫ్ఘాన్ టీ20 మ్యాచ్ లో తండ్రీకొడుకులు.. ఫస్ట్ బాల్ కే సిక్స్ కొట్టిన కొడుకు..



**హైదరాబాద్ పెన్ పవర్:** అఫ్ఘనిస్థాన్ క్రికెట్ లో ఓ అరుదైన సంఘటన చోటుచేసుకుంది. టీ20 టోర్నమెంట్ లో తండ్రీకొడుకులు కలిసి ఆడుతున్నారు. తండ్రి రిటైర్మెంట్ ప్రకటించిన కొన్నేళ్ల తర్వాత కొడుకు అదే జట్టుకు ప్రాతినిధ్యం వహించడం తెలిసిందే. కానీ తండ్రీకొడుకులు కలిసి ఆడడం, అదీ ఫేమస్ టోర్నమెంట్ లో ప్రత్యర్థులుగా బరిలోకి దిగడం మాత్రం అరుదనే చెప్పొచ్చు. అఫ్ఘనిస్థాన్ ప్రీమియర్ టీ20 క్రికెట్ టోర్నీ అయిన స్పాగేజా క్రికెట్ లీగ్ లో ఈ అరుదైన ఘటన చోటుచేసుకుంది. అఫ్ఘనిస్థాన్ జట్టులో ఆల్ రౌండర్ గా రాణిస్తున్న మొహమ్మద్ నబీ (40) ఈ టోర్నీలో మిస్ ఐనక్ రీజియన్ జట్టు తరఫున ఆడుతుండగా.. ఆయన కొడుకు హసన్ ఐసాఖిల్ (18) అమో రీజియన్ జట్టులో ఆడుతున్నాడు. తాజాగా ఈ రెండు జట్ల మధ్య మ్యాచ్ జరగగా.. నబీ బౌలింగ్ చేశాడు. అటువైపు ఆయన కొడుకు ఐసాఖిల్ బ్యాటింగ్ చేశాడు. అయితే, తండ్రి వేసిన తొలి బంతినే ఐసాఖిల్ సిక్సర్ గా మలిచాడు. సాధారణంగా కొడుకు సిక్స్ కొడితే ఏ తండ్రికైనా సంతోషమే. స్టాండ్స్ లో ఉండి చూస్తుంటే నబీ కూడా సంతోషంతో చప్పట్లు చరిచేవాడేమో కానీ తాను వేసిన బంతిని కొడుకు సిక్సర్ కొట్టడంతో ఎలాంటి ఎక్స్ ప్రెషన్ ఇవ్వలేదు. ఆ ఓవర్ లో నబీ మొత్తం 12 పరుగులు ఇవ్వగా.. ఈ మ్యాచ్ లో ఐసాఖిల్ హాఫ్ సెంచరీ (36 బంతుల్లో 52 పరుగులు) చేశాడు.

# దీపిక రుచిని ప్రభాస్ వదల్లేకపోతున్నాడా!



గెహ్నా సిప్పీ తన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో ప్రకాశవంతంగా కనిపిస్తుంది



డార్లింగ్ ప్రభాస్ నాన్ వెజ్ ప్రియుడు. ముక్క లేనిదే ముద్ద దిగదు. తన చుట్టూ ఉండే వాళ్లు కూడా అదే తరహా రుచులని ఆస్వాదించాలనుకుంటాడు. అందుకే తన ఇంటి నుంచి ప్రత్యకంగా వండించి మరీ సహ నటులకు, హీరోయిన్లకు పంపిస్తుంటాడు. ఈ విషయంలో హీరోయిన్లకు ప్రభాస్ ఎంతో ప్రత్యేకం. ప్రభాస్ ఇంట రుచులన్నింటిని దీపికా పదుకొణే కూడా %-%కల్కి%-% షూటింగ్ సమయంలో ఆస్వాదించింది. ప్రభాస్ పంపించిన స్పెషల్ వంటకాల గురించి చెప్పి ఎంతో మురిసిపోయింది.

మరి ప్రభాస్ కి దీపికా ఇష్ట వంట కాన్ని రుచి చూపించిందా? అంటే అవుననే విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీపికా పదుకొణే ఇష్టంగా తినే ఆహారం ఒకటుంది. అదే క్వినోవ్వా. ఇది పూర్తిగా శాఖాహారం. కూరగాయలు..రకరకాల పప్పులు...మసాలా దినుసులతో ఈ ఐటమ్ తయారు చేస్తారు. రిచ్ కిడ్స్ ఎక్కువగా రిచ్ రెస్టారెంట్ లో ప్రిపర్ చేసే ఐటమ్ ఇది. ఈక్వినోవ్వా దీపిక ఎంతో ఇష్టంగా తింటుందిట. స్వయంగా తాను కూడా చేయడం నేర్చుకుందిట. దీపికకు బాగా తెలిసిన వంటకం కూడా ఇదేనట. భర్త రణవీర్ సింగ్ కూడా స్వయంగా వండి ఎంతో ప్రేమతో వడ్డిస్తుందిట. ఇదే ఐటమ్ ను ప్రభాస్ కోసం దీపిక స్పెషల్ వంటకంగా చేసి తిని పించిందిట. అప్పటి వరకూ ఈ ఐటమ్ గురించి ప్రభాస్ కి కూడా తెలియదట. దీపిక రుచి చూపించడంతో అప్పటి నుంచి రెస్టారెంట్ కి వెళ్లిన ప్రతీసారి తన ఆహారంలో క్వినోవ్వా కూడా ఉండేలా చూసుకుంటున్నాడుట.

డార్లింగ్ దీపికను అడిగి రెసిపీ గురించి కూడా అడిగి తెలుసుకున్నాడుట. మొత్తానికి ప్రభాస్ మెచ్చిన వెజ్ వంటకం లిస్ట్ లో కొత్తగా ఇది కూడా యాడ్ అయిందన్న మాట. రాబోయే రోజుల్లో వీరిద్దరి కాంబినేషన్ లో ఇంకెన్ని రుచులు తెరపైకి వస్తాయో చూడాలో. ప్రభాస్ -దీపిక పదుకొణే %-%కల్కి 2%-% షూటింగ్ కూడా పూర్తి చేయాలి. ఇద్దరి మధ్య అసలైన కాంబినేషన్ సన్నివేశాలు రెండవ భాగంలోనే ఉంటాయి. ఈ భాగానికి సంబంధించి షూటింగ్ డేస్ కూడా ఎక్కువగానే ఉన్నాయి. వచ్చే ఏడాది %-%కల్కి 2%-% మొదలవుతుంది.



ధనశ్రీ వర్మ సోల్‌ఫుల్ వైబ్‌లను పంచుకున్నారు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com